
Email : telanganaveenaoffcial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..




http://Epepar.telanganaveena.com | సోమవారం జూన్ 9 2025 | సంపుటి:2 | సంచి 255 | హైదరాబాద్ | పేజీలు:8 | రూ.3/-

# కేబినెట్ విస్తరణ



## కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారం

- క్యాబినెట్‌లోకి వివేక్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్
- ప్రమాణ స్వీకారం చేయించిన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ
- రాంచంద్రునాయక్‌కు డిప్యూటీ స్పీకర్ పదవిపై హామీ
- శాఖల కేటాయింపుపై సస్పెన్స్.. నేడు బాధ్యతల స్వీకరణ



తెలంగాణవీణ, హైదరాబాద్,

తెలంగాణ క్యాబినెట్‌లోకి ఎట్టకేలకు మరో ముగ్గురు మంత్రులు కొత్తగా వచ్చి చేరారు. చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ (ఎస్సీ మాల), ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్(ఎస్సీ మాదిగ), మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి (ముదిరాజ్) మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆదివారం మధ్యాహ్నం 12.19 గంటలకు గవర్నర్ జిష్ణుదేవ్ వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. తొలుత వివేక్ వెంకటస్వామి ఇంగ్లిష్‌లో, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి తెలుగులో ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. రేవంత్ టీమ్‌లో చేరిన ఈ ముగ్గురు మొదటిసారి ఎమ్మెల్యేలే కావడం గమనార్హం. అలాగే, డోర్నకల్ -మిగతా 2 లో





# దేశంలో కరోనా పంజా..!

- 6వేల మార్క్‌ని దాటిన యాక్టివ్ కేసులు..!

న్యూఢిల్లీ

దేశంలో కరోనా మహమ్మారి రోజురోజుకు విస్తరిస్తున్నది. ప్రస్తుతం దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 6వేల మార్క్‌ని దాటింది. గత 24గంటల్లో ఆరుగురు కరోనాతో ప్రాణాలు కోల్పోయారు. కేరళలో అత్యధికంగా కేసులు నమోదయ్యాయి. ఆ రాష్ట్రంలో 1950 కేసులున్నాయి. గత 24 గంటల్లో 144 కేసులు పెరిగాయి. ఆ తర్వాత గుజరాత్ రెండోస్థానంలో ఉన్నది. ఈ రాష్ట్రంలో 822 కేసులు ఉండగా.. ఢిల్లీలో 686, మహారాష్ట్రలో 595, కర్ణాటకలో 366, ఉత్తరప్రదేశ్‌లో 219, -మిగతా 2 లో

## దత్తాత్రేయ అందరివాడు..

# అజాత శత్రువు

### ముఖ్య అతిథులుగా తెలంగాణ, ఏపీ సీఎంలు

- ఆయన జీవిత చరిత్ర ఆవిష్కరణలో వక్తలు
- 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకాన్ని
- ఆవిష్కరించిన మాజీ రాష్ట్రపతి కోవింద్
- ఐదు రాష్ట్రాల గవర్నర్లు, ఇద్దరు కేంద్ర మంత్రులు,
- పలువురు తెలంగాణ, ఏపీ మంత్రులు హాజరు

తెలంగాణవీణ, హైదరాబాద్

సిద్ధాంత పరంగా ఎన్ని అభిప్రాయభేదాలున్నా తన వ్యక్తిత్వం ద్వారా అన్ని పార్టీల నేతలను కలుపుకునిపోయే దత్తాత్రేయ అందరివాడనీ, అజాత శత్రువని వక్తలు ముక్తకంఠంతో కొనియాడారు. అన్ని పార్టీల నేతలను అలరు.. -మిగతా 2 లో





# మాగంటికి కన్నీటి వీడ్కోలు

- అధికారిక లాంఛనాలతో రాయదుర్గం మహాప్రస్థానంలో అంత్యక్రియలు
- పాడె మోసిన కేటీఆర్, హరీశ్‌రావు
- నివాళులు అర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, మాజీ సీఎం కేసీఆర్

తెలంగాణవీణ, జూబ్లీహిల్స్

హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతిచెందారు. గుండె సంబంధిత సమస్యతో బాధపడుతూ గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందిన ఆయన పరిస్థితి విషమించి ఆదివారం తెల్లవారుజామున చనిపోయారు. ఆయన మృతి పట్ల సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు, ఇతర ప్రముఖులు, వివిధ -మిగతా 2 లో

## నేడు కాళేశ్వరం కమిషన్


# ముందుకు హరీశ్‌రావు

తెలంగాణవీణ, హైదరాబాద్,

కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ కోసం ఏర్పాటైన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట నీటిపారుదలశాఖ మాజీ మంత్రి హరీశ్‌రావు నేడు (సోమవారం) హాజరుకానున్నారు. కమిషన్‌కు నేతృత్వం వహిస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ హరీశ్‌రావును విచారించనున్నారు .ఇప్పటికే అన్నిదశల్లో విచారణ పూర్తిచేసిన కమిషన్.. ప్రస్తుతం రాజకీయ ప్రముఖులను విచారిస్తున్నది.



ఇప్పటికే ఆర్థికశాఖ మాజీ మంత్రి ఈటల రాజేందర్‌ను ప్రశ్నించగా నేడు హరీశ్‌రావును విచారించనుంది.



# మహిళల అభివృద్ధే లక్ష్యంగా పనిచేశాం

## ప్రధాని మోడీ


తెలంగాణవీణ, న్యూఢిల్లీ

మహిళల అభివృద్ధి కోసం ఎన్డీఏ సర్కార్ చేపట్టిన పథకాలు, కార్యక్రమాలను ప్రధాని మోడీ మరోసారి గుర్తు చేశారు. మహిళల నేతృత్వంలో సాధించిన విజయాలను ప్రస్తావించారు. కేంద్రంలో వరుసగా మూడోసారి మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పాటై రేపటికి ఏడాది పూర్తి కావొస్తోంది. ఈ నేపథ్యంలోనే 11 ఏండ్ల ఎన్డీఏ ప్రభుత్వం సాధించిన విజయాలను ఆయన 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. "విద్యా, క్రీడలు, -మిగతా 2 లో

## నైరుతి రుతుపవనాల

# మందగమనం

- సీజన్ తొలివారంలోనే లోటు వర్షపాతం నమోదు
- పెరిగిన గరిష్ఠ ఉష్ణోగ్రతలు, వాతావరణశాఖ వెల్లడి



తెలంగాణవీణ, హైదరాబాద్,

నైరుతి రుతుపవనాల గమనం మందగించడంతో రాష్ట్రవ్యాప్తంగా వానలు ముఖం చాటేశాయి. ఈ ఏడాది రుతుపవనాలు నిర్ధిష్ట సమయం కంటే ముందుగానే రాష్ట్రంలో ప్రవేశించినప్పటికీ ..ఆశించిన స్థాయిలో వర్షాలు లేవు. నాలుగు రోజులుగా నైరుతి రుతుపవనాల్లో ఎలాంటి కదలిక లేదని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నెల 15 తర్వాత కొద్దిగా మార్పు వచ్చే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ అధికారులు చెప్తున్నారు. జూలై మొదటి వారం నుంచి వర్షాలు స్థిరంగా ఉండే అవకాశముందని అంచనా వేస్తున్నారు. కాగా, సీజన్ మొదటివారంలో రాష్ట్రంలో –79 మి.మీ లోటు వర్షపాతం -మిగతా 2 లో

# మణిపూర్‌లో మళ్లీ అశాంతి

- స్వచ్ఛంద సంస్థ నేత అరెస్టుతో పెల్లుబికిన హింస
- ఐదు జిల్లాల్లో కర్ఫ్యూ,
- ఇంటర్నెట్ నిలిపివేత



తెలంగాణవీణ, ఇంఫాల్

మణిపూర్‌లో మళ్లీ అశాంతి చెలరేగింది. మైతీ – కుకీ తెగల మధ్య జరుగుతున్న ఘర్షణలతో ప్రమేయం ఉన్నదన్న ఆరోపణలపై మైతీ తెగకు చెందిన స్వచ్ఛంద సంస్థ అరంబై తెంగల్ (ఎటి) నేత కనన్ సింగ్‌ను పోలీసులు శనివారం ఎయిర్‌పోర్ట్‌లో అరెస్ట్ చేయడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఆయనతోపాటు మరో నలుగురిని విచారణ కోసం పోలీసులు అదుపులోకి -మిగతా 2 లో

# నేడు సిట్ విచారణకు ప్రభాకర్‌రావు

- హైదరాబాద్ చేరుకున్న ఎస్ఐబీ మాజీ ఐజీ



తెలంగాణవీణ, హైదరాబాద్

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక సూత్రధారి అయిన ఎస్ఐబీ మాజీ ఐజీ ప్రభాకర్‌రావు అమెరికా నుంచి ఆదివారం రాత్రి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అక్కడ నుంచి ఆయన ఇబ్రహీంబాగ్‌లోని తన విల్లాకు వెళ్లారు. కాగా, సోమవారం ఫోన్‌ట్యాపింగ్ కేసును దర్యాప్తు జరుపుతున్న జూబ్లీహిల్స్ స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(సిట్) అధికారుల ఎదుట హాజరు కానున్నారు. అమెరికాలో తన చికిత్స -మిగతా 2 లో

# కేబినెట్ విస్తరణ

(మొదటి పేజి తరువాయి)

నియోజకవర్గం నుంచి మొదటిసారి గెలుపొందిన జాటోత్ రాంచంద్రునాయక్‌ను శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా నియమించబోతున్నట్టు కాంగ్రెస్ ప్రకటించింది. కొత్త మంత్రులతో పాటు త్వ రలో బాధ్యతలు చేపట్టబోయే డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్‌కు సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

### ఆ నలుగురు గైర్హాజర్

మంత్రి పదవులు ఆశించి భంగపడిన నలుగురు ఎమ్మెల్యేలు పీ సుదర్శన్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్‌రావు, మల్‌రెడ్డి రంగారెడ్డి కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారానికి గైర్హాజర్ అయినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈసారి మంత్రివర్గ విస్తరణలో సుదర్శన్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి చోటు దకుతుందని ప్రచారం జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా సుదర్శన్‌రెడ్డి పేరు సిఫారసు చేయటంతో ఆయనకు బెర్తు ఖాయమని అనుకున్నారు. సీఎం కార్యాలయ వర్గాలు కూడా శనివారం ఆయనకు ఫోన్ చేసి అందుబాటులో ఉండాలని సూచించినట్టు తెలిసింది.

అర్ధరాత్రి వరకు ఆయన పేరు ఫైనల్ లిస్టులో ఉందనే ప్రచారం జరిగింది. కానీ, ఆదివారం ఆయన పేరు అనూహ్యంగా గల్లంతు కావడంలో మపస్తాపానికి గురైనట్టు తెలిసింది. దీంతో ఆయన ప్రమాణ స్వీకారానికి గైర్హాజరయ్యారని ఆయన అనుచరులు చెప్తున్నారు. ఇంటి ముంగిట వరకు వచ్చిన మంత్రి పదవి జానారెడ్డి మంత్రాంగంతోనే తనకు కాకుండా పోయిందనే ఆవేదనతో ఉన్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రమాణ స్వీకారానికి గైర్హాజరైనట్టు తెలిసింది. అలాగే, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మంత్రి వర్గ ప్రమాణ స్వీకారానికి డుమ్మా కొట్టినట్టు తెలిసింది.

### శాఖలపై సస్పెన్స్

మంత్రులుగా ప్రమాణ స్వీకారం పూర్తి కావడంతో ప్రస్తుతం వారికి కేటాయించే శాఖలపై సస్పెన్స్ కొనసాగుతున్నది. శాఖల కేటాయింపుపై ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయాల ఆధారంగా సీఎస్ రామకృష్ణారావు గెజిట్‌తో పాటు ఉత్తర్వులు జారీ చేయనున్నారు. అయితే ఎవరికి ఏ శాఖను కట్టబెడతారనేది ఆసక్తిగా మారింది. పాత మంత్రులకు చెందిన శాఖల్లో మార్పులు చేర్పులు చేసి కొత్త వారికి ఇస్తారా? లేక ముఖ్యమంత్రి వద్ద ఉన్న శాఖలను కేటాయిస్తారా? అనేది చర్చనీయాంశంగా మారింది.

### తొలి ప్రయత్నంలోనే వివేక్‌కు మంత్రిపదవి

వివేక్ వెంకటస్వామి ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన నేత. ఆయన తండ్రి దివంగత వెంకటస్వామి సుదీర్ఘ కాలం కాంగ్రెస్‌లో కొనసాగారు. ప్రముఖ వ్యాపారవేత్తగా ఉన్న వివేక్ కాంగ్రెస్ పార్టీతో రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. 2009లో పెద్దపల్లి పార్లమెంట్ స్థానం నుంచి ఎంపీగా గెలిచారు.

### ఖర్గేతో వాకిటి శ్రీహరికి సాన్నిహిత్యం

బీసీ ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వాకిటి శ్రీహరి 2023 శాసనసభ ఎన్నికల్లో మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేతో శ్రీహరికి మంచి సాన్నిహిత్యం ఉన్నదని చెప్తారు. సర్పంచ్‌గా, ఎంపీటీసీగా, జడ్పీటీసీగా పనిచేశారు.

### ఐదుసార్లు ఓడినా అడ్లూరికి జాక్‌పాట్

ఎస్సీ-మాదిగ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత. ఎన్ఎస్‌యూఐ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 1996-2001 వరకు ఉమ్మడి ఏపీలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా కూడా పనిచేశారు. పాత మేడారం నియోజకవర్గం, ధర్మపురి నియోజకవర్గాల నుంచి ఐదుసార్లు ఓడిపోయిన లక్ష్మణ్ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ధర్మపురి నుంచి విజయం సాధించారు.

# దత్తాత్రేయ అందరివాడు.. అజాత శత్రువు

(మొదటి పేజి తరువాయి)

బలరు ద్వారా ఒకే వేదికపైకి తీసుకొచ్చే ఒరవడి దత్తాత్రేయతో సాధ్యమైనందని చెప్పారు. హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ రచించిన 'ప్రజల కథే నా ఆత్మకథ' జీవిత చరిత్రను ఆదివారం హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆవిష్కరించారు. అనంతరం కోవింద్ మాట్లాడుతూ..ప్రజల కోసం దత్తాత్రేయ తన జీవితం సాగించాడని కొనియాడారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. ఆయనకు శత్రువుల్లేరనీ, అందరూ హితులేనని చెప్పారు. ఏపీ, తెలంగాణ తనకు రెండో ఇల్లు లాంటివని తెలిపారు. 1994 నుంచి దత్తాత్రేయతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. కనీస వేతనం, కనీస పెన్షన్, ఈఎస్ఐ ఆస్పత్రుల బలోపేతం తదితర పథకాల రూపకల్పనలో దత్తాత్రేయ కృషి మరువలేదనీ, ఆయన కార్మికులకు ఎంతో మేలు చేశారని తెలిపారు. అధిక ఉష్ణోగ్రతలుండే దక్షిణ భారతం నుంచి సున్నా డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే హిమాచల్ ప్రదేశ్‌లో గవర్నర్‌గా పనిచేయడమంటేనే ప్రజాసేవ పట్ల ఆయనకున్న చిత్తశుద్దేంటో అర్థమవుతుందన్నారు.

### బూతులు మాట్లాడేవారికి బూతుల్లోనే బుద్ధి చెప్పండి : ఎం.వెంకయ్యనాయుడు

ఉన్న విషయాలు, నిజాలు చెప్పాలి కాబట్టి తాను జీవితచరిత్రను రాయదల్చుకోలేదని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చలోక్తి విసిరారు. దత్తాత్రేయ ఎప్పుడూ గంజి మనిషేననీ, బెంజి మనిషిగా మారలేదని చెప్పారు. పదవుంటే హంగూఆర్భాటాలు చేయడాన్ని తప్పుబట్టారు. డైపర్లను మార్చినట్టు పదవుల కోసం పార్టీలు మారే ధోరణి శ్రేయస్కరం కాదన్నారు. రాజకీయాల్లో బూతులు మాట్లాడేవారిని బూతుల్లోనే (పోలింగ్ కేంద్రాలు) ఓటు ద్వారా బుద్ధిచెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అర్థవంతమైన రాజకీయ విమర్శలు ఒడాలనీ, అయితే, అవి సంస్కారహీనంగా లేకుండా చూసుకోవాలని నాయకుల్ని కోరారు. విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని సూచించారు.

### జెంటిల్‌మెన్‌కు ప్రతిరూపం దత్తాత్రేయ : చంద్రబాబు నాయుడు

జెంటిల్‌మెన్‌కు ప్రతిరూపం బండారు దత్తాత్రేయ అని ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు కొనియాడారు. ఈ రోజుకు ఇక్కడకు రాగానే పాతరోజులు గుర్తుకొస్తున్నాయన్నారు. ప్రజా సమస్యలపై సీఎంలకు లేఖలు రాసిరాసీ లేఖల రాయుడికి అంబాసిడర్‌గా మారారని చలోక్తి విసిరారు. హైదరాబాద్‌లో ఐటీ అభివృద్ధి కోసం సైబరాబాద్‌ను నిర్మించామనీ, ఇప్పుడివన్నీ చూస్తుంటే ఎంతో తృప్తి కలుగుతోందని చెప్పారు. తెలుగు జాతికి చరిత్రలో ప్రత్యేక స్థానముంద న్నారు. పీవీ నర్సింహారావు ఆర్థిక సంస్కరణలు తెచ్చి దేశ దశదిశను మార్చారని కొనియాడారు.

### గల్లీ నుంచి గవర్నర్‌గా ఎదిగినా దత్తన్న ప్రజల మనిషే : ఎ. రేవంత్‌రెడ్డి

గౌలిగూడ గల్లీ నుంచి గవర్నర్‌గా ఎదిగినా దత్తన్న ఎప్పుడూ ప్రజల మనిషే అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కొనియాడారు. దత్తాత్రేయ, కిషన్‌రెడ్డి కుటుంబాలతో తనకు సత్సంబంధాలున్నాయని చెప్పారు. ఇటీవల ప్రధాని మోడీని కలిసినప్పుడు..'మీ స్కూళ్లో చదివా. కాలేజీ చంద్రబాబు దగ్గర చేశా, ఉద్యోగం రాహుల్‌గాంధీ దగ్గర ఉద్యోగం చేస్తున్నా' అంటూ తన రాజకీయ ప్రస్తావనాన్ని గుర్తుచేసుకున్నారు. జాతీయ స్థాయిలో వాజ్‌పేయికున్న గౌరవం రాష్ట్ర రాజకీయాల్లో దత్తాత్రేయకు ఉందని కొనియాడారు. అలరు.. బలరు తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తిగా నిలి చిందని గుర్తుచేశారు. హైదరాబాద్ జంట నగరాల ప్రజల గుండెల్లో పీజేఆర్, దత్తన్న ఎప్పటికీ నిలిచి ఉంటారనీ, ఇప్పుడు అలాంటి నేతలు రావడంలేదని చెప్పారు. అభివృద్ధి విషయంలో తనతో కిషన్‌రెడ్డి కలిస్తే రాష్ట్రం మరింత ముందుకెళు ందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# మాగంటికి కన్నీటి వీడ్కోలు

(మొదటి పేజి తరువాయి)

పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాయదుర్గం మహాప్రస్థానంలో అధికారిక లాంఛనాలతో మాగంటి గోపీనాథ్ అంత్యక్రియలు నిర్వహించారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. ఇటీవల డయాలసిస్ కూడా చేయించుకున్నారు. ఈ క్రమంలో ఈ నెల 5వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు మాదాపూర్ కావూరిహిల్స్‌లోని తన నివాసంలో ఆయనకు గుండెపోటు రాగా, వెంటనే కుటుంబ సభ్యులు ఏఐజీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో ప్రత్యేక వైద్య బృందం పర్యవేక్షణలో ఆయనకు చికిత్స అందించారు. ఐసీయూలోనే 48 గంటలపాటు అబ్జర్వేషన్‌లో ఉంచినట్టు వైద్యులు తెలిపారు. ఈ క్రమంలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఇతర నేతలు మాగంటి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆయనకు మెరుగైన వైద్యం అందుతుందని, ఆరోగ్యం నిలకడగానే ఉందని మీడియాకు వెల్లడించారు. కేటీఆర్ అర్థాంతరంగా అమెరికా పర్యటన ముగించుకుని వచ్చి మాగంటిని పరామర్శించారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం మాగంటి గోపీనాథ్‌కు బ్రెయిన్ డెడ్ అయ్యి మృతిచెందినట్టు ఏఐజీ వైద్యులు ప్రకటించారు.

### మహాప్రస్థానంలో అంత్యక్రియలు

మాగంటి అంత్యక్రియలు రాయదుర్గంలోని సినీ ప్రముఖుల మహాప్రస్థానంలో నిర్వహించారు. ఇంటి నుంచి మహాప్రస్థానం వరకు అంతిమయాత్ర కొనసాగింది. ఈ యాత్రలో కుటుంబ సభ్యులు, పార్టీ నేతలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు పాడె మోశారు. మహాప్రస్థానంలో అధికారిక లాంఛనాలతో మాగంటి అంత్యక్రియలు జరగ్గా.. ఆయన కుమారుడు మాగంటి మృతదేహానికి నిప్పుపెట్టారు.

### మాగంటి రాజకీయ ప్రస్థానం

ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ 1963లో హైదరాబాద్‌లోని నానాక్‌రాంగూడలో జన్మించారు. 1983లో ఎన్టీ రామారావు స్థాపించిన టీడీపీలో చేరారు. పార్టీలో అంచెలంచెలుగా ఎదుగుతూ 2014లో టీడీపీ నుంచి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా గెలుపొందారు.

అనంతరం అప్పటి టీఆర్ఎస్‌లో 2016లో చేరారు. 2018, 2023 ఎన్నికల్లోనూ ఎమ్మెల్యేగా గెలిచారు. వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి, జూబ్లీహిల్స్ ప్రజల మన్ననలు పొందారు.

# మణిపూర్‌లో మళ్లీ అశాంతి

(మొదటి పేజి తరువాయి)

తీసుకున్నట్టు వార్తలు వచ్చాయి. ఎటి కార్యకర్తలు భద్రతా దళాలతో ఘర్షణకు దిగారు. విమానాశ్రయ రహదారిపై భద్రతా దళాలు ప్రయాణించే బస్సును తగలబెట్టారు. భద్రతా సిబ్బందిసహా పలువురు ఈ ఘర్షణల్లో గాయపడ్డారు. తమ నేతను విడిచిపెట్టకపోతే ఆత్మాహుతి చేసుకుంటామంటూ కొందరు యువకులు రాజధాని ఇంఫాల్‌లో పెట్రోల్ పోసుకుని ఆందోళన చేశారు. శనివారం రాత్రి రోడ్లపై టైర్లకు నిప్పు పెట్టి ట్రాఫిక్‌ను అడ్డుకున్నారు. కాల్పుల శబ్దాలు కూడా వినిపించాయని ఇంఫాల్ వాసులు తెలిపారు. 'మేము ఆయుధాలను విడిచి పెట్టాము. వరదల సమయంలో మీరు చేయాల్సిన పనుల్ని మేమే చేశాం. ఇప్పుడు మీరు మమ్మల్ని అరెస్ట్ చేస్తున్నారు. ఇప్పుడు మేము ఆత్మాహుతి చేసుకుంటాం' అంటూ కొందరు యువకులు కేకలు వేశారు. అరెస్టులను నిరసిస్తూ ఇంఫాల్ వ్యాలీలోని ఇంఫాల్ తూర్పు, పశ్చిమ, బిష్ణుపూర్, కాక్చింగ్, థౌబల్ జిల్లాల్లో పది రోజులపాటు షట్ డౌన్ విధిస్తామంటూ అరంబై తెంగల్ తెలిపింది. ఈ ఐదు జిల్లాల్లో ప్రభుత్వం కర్ఫ్యూ విధించడంతోపాటు ఇంటర్నెట్‌పై నిషేధం విధించింది. దీంతో ఆదివారం రహదారులు నిర్మానుష్యంగా కనిపించాయి. పోలీసులు అరెస్టు చేసిన కనన్‌సింగ్ మాజీ హెడ్ కానిస్టేబుల్. అరంబై తెంగల్ సభ్యుడైన కరన్‌సింగ్‌ను అరెస్టు చేసినట్లు సిబిఐ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. 2023లో వివిధ క్రిమినల్ కార్యకలాపాల్లో కనన్‌సింగ్ పాల్గొన్నాడని, అరెస్టు చేస్తున్న విషయాన్ని అతని కుటుంబ సభ్యులకు తెలియజేశామని పేర్కొంది. సుప్రీంకోర్టు సూచనల మేరకు మణిపూర్‌లో హింసకు సంబంధించిన కేసులను పరిశీలిస్తున్నామని పేర్కొంది. ఇక్కడి కేసుల విచారణ గౌహతికి మారిందని, కనన్‌సింగ్‌ను ఇంఫాల్ నుంచి గౌహతి తరలించామని, విచారణ కొనసాగుతుందని తెలిపింది.

# దేశంలో కరోనా పంజా..!

(మొదటి పేజి తరువాయి)

తమిళనాడులో 194, రాజస్థాన్‌లో 132, హర్యానాలో 102 కరోనా కేసులు గుర్తించారు. 24 గంటల్లో కేరళలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఇందులో ఒకరు 51 సంవత్సరాల వయసు ఉండగా.. మరొకరికి 64, మూడో వ్యక్తికి 92 సంవత్సరాలు. ఈ ముగ్గురు ఇప్పటికే పలు వ్యాధులతో బాధపడుతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. అలాగే, కర్నాటకలోనూ ఇద్దరు కొవిడ్‌తో ప్రాణాలు కోల్పోయారు.వీరికి సైతం ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని.. తమిళనాడులో 42 ఏళ్ల వ్యక్తి కరోనాతో ప్రాణాలు కోల్పోయినట్లు అధికార వర్గాలు తెలిపాయి. కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రిత్వశాఖ తెలిపిన వివరాల ప్రకారం.. గత 48 గంటల్లో 769 కొత్త కేసులు నమోదవగా.. యాక్టివ్ కేసుల సంఖ్య 6వేలు దాటాయి. ఓ వైపు కొవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సౌకర్యాల స్థాయి సంసిద్ధతను తనిఖీ చేసేందుకు మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నది. ఆక్సిజన్, ఐసోలేషన్ పడకలు, వెంటిలేటర్లు, అవసరమైన మందుల లభ్యతను నిర్ధారించేందుకు అన్ని రాష్ట్రాలను ఆదేశించింది. భారత్‌లో 6,133 యాక్టివ్ కోవిడ్ కేసులు ఉన్నాయని మంత్రిత్వ శాఖ తెలిపింది. చాలా కేసులు తేలికపాటివి లక్షనాలు ఉన్నాయని.. ఇంట్లోనే ఐసోలేషన్‌లో ఉంటే సరిపోతుందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది జనవరి నుంచి దేశంలో 65 మరణాలు సంభవించాయి.

# మహిళల అభివృద్దే లక్ష్యంగా పనిచేశాం

(మొదటి పేజి తరువాయి)

స్టార్టప్, సైన్స్ ఇలా అన్ని రంగాల్లో మహిళలు తమదైన ముద్ర వేస్తున్నారు. అంతర్జాతీయ వేదికలపైనా మన దేశ కీర్తిని పెంచుతున్నారు. అనేక మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా ఎన్డీఏ సర్కార్ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది. స్వచ్ఛ భారత్ ద్వారా వారి గౌరవాన్ని కాపాడడం నుంచి జన్‌ధన్ ఖాతాలతో వారిని ఆర్థికంగా బలోపేతం చేసేంత వరకు ఎన్నో పథకాలు అమలు చేశాం. పేద మహిళల ఆరోగ్యం దృష్ట్యా 'ఉజ్వల్ యోజన' పథకం కింద గ్యాస్ సిలిండర్లు అందించాం. 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన'తో పేదలకు ఉచితంగా ఇండ్లు నిర్మించి ఇచ్చాం. ప్రతి ఆడబిడ్డను రక్షించేందుకు, వారు ఉన్నతంగా ఎదిగేందుకు 'బేటీ బచావో, బేటీ పడావో'ను అమలు చేశాం. పేదలు, రైతులు, యువత కోసం ఎన్డీఏ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని మీరంతా చూశారు. మహిళా సాధికారతే లక్ష్యంగా 11 ఏండ్లుగా కృషి చేస్తున్నాం" అని ప్రధాని మోడీ వివరించారు.

# నైరుతి రుతుపవనాల మందగమనం

(మొదటి పేజి తరువాయి)

నమోదైంది.రాష్ట్రంలోని నారాయణపేట -55 మి.మీ, యాదాద్రి-భువనగిరిలో -56 మి.మీ, సిద్దిపేటలో -57 మి.మీ, మహబూబాబాద్‌లో -58 మి.మీ, జనగామలో -58 మి.మీ, మేడ్చల్-మల్కాజిగిరిలో -59 మి.మీ లోటు వర్షపాతం నమోదవగా మిగతా 27 జిల్లాల్లో తీవ్ర లోటు వర్షపాతం నెలకొంది. మరోవైపు ఐదు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. తీవ్ర ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతున్నారు. కొన్ని జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరాయి. మంగళవారం పలు జిల్లాల్లో వర్షం కురిసే అవకాశమున్నదని, వాతావారణశాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

# నేడు సిట్ విచారణకు ప్రభాకర్‌రావు

(మొదటి పేజి తరువాయి)

నిమిత్తం ఉంటున్న ప్రభాకర్‌రావు ఈ కేసులో కీలక నిందితుడని సిట్ తేల్చింది. ఏడాది కాలంగా ఆయ న్ను విచారించడానికి సిట్ అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేశారు. ఇంటర్‌పోల్ సహాయాన్ని కూడా అర్థించారు. తనకు బెయిల్ కోసం సుప్రీం కోర్టులో ప్రభాకర్‌రావు ప్రయత్నించారు. బెయిల్ పిటిషన్‌పై విచారణను వాయిదా వేసిన సుప్రీం కోర్టు ప్రభాకర్‌రావు మాత్రం వెంటనే విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. అప్పటివరకూ చట్టపరంగా ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని దర్యాప్తు అధికారులకు సూచించింది. సుప్రీంకోర్టు జారీ చేసిన పాస్‌పోర్టు సహాయంతో ప్రభాకర్‌రావు హైదరా బాద్‌కు చేరుకున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్, ఇతర పార్టీలకు చెందిన ప్రముఖ నాయకులతో పాటు వ్యాపారులు, పలువురు సినీ ప్రముఖుల ఫోన్ల ట్యాపింగ్ చేయాలని ఎస్ఐబీ చీఫ్‌గా ఉన్న ప్రభాకర్‌రావు అంతర్గతంగా తన అధికార బృందానికి ఆదేశించినట్టు ఆరోపణలు న్నాయి. ఎస్ఐబీ కార్యాలయంలోనే ప్రత్యేక గదిని ఏర్పాటు చేసుకుని ఆధునిక పరికరాల ద్వారా ఆయన కిందిస్థాయి సిబ్బంది ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్టు సిట్ దర్యాప్తులో తేల్చింది. అరెస్టు చేసిన నలుగురు అధికారులు సైతం ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకే తాము ఫోన్ ట్యాపింగ్‌లకు పాల్పడినట్టు వాగ్మూలం ఇచ్చారు. అందులో కీలక పాత్ర వహించిన ఐ న్యూస్ సీఈఓ శ్రవణ్‌రావు సైతం ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకే వ్యవహారాలు నడిపించినట్టు సిట్ దర్యాప్తులో ఒప్పుకున్నారు. ఈ నేపథ్యంలో సిట్ ఎదుట విచారణ హాజరుకాబోతున్న ప్రభాకర్‌రావును విచారించడానికి ప్రశ్నల జాబితాతో సిట్ అధికారులు సిద్ధమయ్యారు. ముఖ్యంగా, ఏ నాయకుల ఆదేశాలతో ఫోన్ ట్యాపింగ్ చేశారు? కీలక నేతలు ఎవరెవరు దాని వెనుక ఉన్నారు? మొత్తం వ్యవహారాన్ని ఎవరు నడిపించారు? తదితర ప్రశ్నలను సిట్ అధికారులు సంధించనున్నట్టు తెలిసింది. మొత్తంమీద ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక సూత్రధారిగా పేర్కొనబడుతున్న మాజీ ఐజీ ప్రభాకర్‌రావు దర్యాప్తు అధికారుల ముందు ఎలాంటి నిజాలను బయటపెట్టబోతున్నారనే ఉత్కంఠ ఇటు బీఆర్ఎస్‌తో పాటు అన్ని రాజకీయ పక్షాల్లో నెలకొంది. ఇప్పటికే సిట్ దర్యాప్తు జరిపే జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయం వద్ద ప్రభాకర్‌రావు విచారణ కోసం అధికారులు ఏర్పాట్లను పూర్తిచేసినట్టు తెలిసింది. మరోవైపు పశ్చిమ మండలం డీసీపీ విజరుకుమార్‌తో పాటు కేసు దర్యాప్తును పర్యవేక్షిస్తున్న జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరితో పాటు మరికొందరు అధికారులు సమావేశమై ప్రభాకర్‌రావును విచారించే అంశాలపై చర్చించారని తెలిసింది.

తెలంగాణ వీణ
తెలంగాణ వీణ ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ,
లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
8328209811




# తమిళంలో మాట్లాడలేకపోయానంటూ క్షమాపణలు చెప్పిన అమిత్ షా..!



**తెలంగాణవీణ, న్యూఢిల్లీ**
వచ్చే ఏడాది జరుగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దించబోతున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. మధురైలో బీజేపీ కోర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అమిత్ షా పాల్గొని మాట్లాడారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, ఏఐఏడీఎంకే కలిసి ఎన్డీయే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయని జోష్యం చెప్పారు. పశ్చిమ బెంగాల్‌లో సైతం ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. తమిళనాడు ప్రజలు మార్పును కోరుకుంటున్నారని.. బీజేపీ కార్యకర్తలు పార్టీని గెలిపించేందుకు పూర్తిగా సిద్ధంగా ఉన్నారని షా పేర్కొన్నారు. అమిత్ షా డీఎంకేను ఓడించలేరని ఎంకే స్టాలిన్ అంటున్నారని.. ఆయన చెప్పింది నిజమేనని.. ఆయనను తాను ఓడించలేనని.. తమిళ ప్రజలు ఓడిస్తారన్నారు. ఈ సందర్భంగా రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు సన్నాహాలపై కేంద్ర హోంమంత్రి సమీక్షించారు. రాష్ట్ర నాయకులతో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు.మిళనాడు ప్రజలు డీఎంకే ప్రభుత్వ అవినీతితో విసిగిపోయారని.. బీజేపీ కార్యకర్తలు ప్రతి వీధి, పరిసరాలు, ఇంటింటికి చేరుకుని మోదీ నేతృత్వంలోని ఎన్డీయే అభివృద్ధిని ప్రజలకు వివరిస్తారని ఎక్స్‌పోస్ట్‌లో పేర్కొన్నారు. గత పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం తమిళనాడుకు రూ.6.80లక్షల కోట్లు ఇచ్చిందని షా పేర్కొన్నారు. అయినా రాష్ట్రానికి కేంద్రం ఏం చేసిందని స్టాలిన్ అడుగుతున్నారన్నారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చారో లేదో చెప్పాలని స్టాలిన్‌ను డిమాండ్ చేశారు. మద్యం కుంభకోణానికి సమానమైన డబ్బుతో తమిళనాడులోని ప్రతి పాఠశాలలో కనీసం రెండు తరగతి గదులు నిర్మించి ఉండవచ్చన్నారు. ఇదిలా ఉండగా.. అమిత్ షా అంతకు ముందు మీనాక్షి అమ్మవారి ఆలయాన్ని దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ కార్యకర్తలను ఉద్దేశించి షా మాట్లాడుతూ.. తమిళంలో మాట్లాడలేకపోవడంపై విచారం వ్యక్తం చేశారు. భారతదేశంలోని గొప్ప భాషల్లో ఒకటైన తమిళంలో తాను మాట్లాడలేనని.. అందుకు పార్టీ కార్యకర్తలకు క్షమాపణలు చెబుతున్నానన్నారు

## మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్తత. ఐదు జిల్లాల్లో ఇంటర్నెట్ సేవలు బంద్





**తెలంగాణవీణ, ఇంఫాల్**
ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మెయితీ తెగకు చెందిన వాలంటీర్ గ్రూప్ అరంబాయ్ టెంగోల్ నాయకుడు కానన్ సింగ్‌ను పోలీసులు ఇంఫాల్‌లో శనివారం అరెస్టు చేశారు. దీంతో మెయితీ తెగకు చెందిన యువత పెద్ద సంఖ్యలో వీధుల్లోకి వచ్చి నిరసనకు దిగారు. షాపులను ధ్వంసం చేయడంతోపాటు రోడ్లపై టైర్లను కాల్చివేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. కానన్ సింగ్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాగా, ఇంఫాల్‌లోని క్వాకైథల్ ప్రాంతంలో తుపాకీ చప్పుళ్లు వినిపించాయని పలువురు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.కాగా, తాజా ఉద్రిక్తల నేపథ్యంలో శనివారం రాత్రి 11.45 గంటల నుంచి ఐదు లోయ జిల్లాల్లో ఇంటర్నేట్, మొబైల్ డేటా సేవలను ప్రభుత్వం నిలిపివేసింది. ఈ ఆంక్షలు ఐదు రోజులపాటు అమల్లో ఉంటాయని పేర్కొంది. శాంతిభద్రతల దృష్ట్యా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఇంఫాల్ వెస్ట్, ఇంఫాల్ ఈస్ట్, తౌబాల్, బిష్ణుపూర్, కాక్చింగ్ జిల్లాల్లో ఇంటర్నెట్ సేవలను సస్పెండ్ చేసినట్లు తెలిపింది.

## రష్యాపై ఉక్రెయిన్ డ్రోన్ల దాడి



**తెలంగాణవీణ, మాస్కో**
రష్యాపై ఉక్రెయిన్ డ్రోన్ దాడికి పాల్పడింది. ఈ దాడి కారణంగా రెండు కీలక విమానాశ్రయాలను మూసివేసినట్లు రష్యా అధికారులు తెలిపారు. భద్రత కోసం వ్నుకోవో మరియు డొమోడెడోవో విమానాశ్రయాల్లో విమానాల రాకపోకలను నిలిపివేసినట్లు రష్యా పౌర విమానయాన సంస్థ రోసావియాట్సియా పేర్కొన్నారు. ఆదివారం తెల్లవారుజామున 4.00 గంటల సమయంలో మాస్కో వైపు దూసుకువస్తున్న తొమ్మిది ఉక్రేనియన్ డ్రోన్‌లను రష్యా వైమానిక రక్ష విభాగాలు ధ్వంసం చేయాని మేయర్ సెర్గీ సోబ్యానిన్ తెలిపారు.
ఉక్రెయిన్ డ్రోన్ దాడితో తులా ప్రాంతంలోని అజోట్ కెమికల్ ప్లాంట్‌లో స్వల్పకాలిక మంటలు చెలరేగాయని, ఇద్దరు సిబ్బంది గాయపడ్డారని అన్నారు. కలుగ ప్రాంతంలో ఏడు డ్రోన్లను కూల్చివేసినట్లు ప్రాంతీయ గవర్నర్ తెలిపారు. ఈ రెండు ప్రాంతాలు మాస్కోకు దక్షిణంగా, రాజధానికి సరిహద్దుగా ఉన్నాయి.

## 270 ఏళ్ల తర్వాత పద్మనాభస్వామి ఆలయంలో అరుదైన మహా కుంభాభిషేకం



**తెలంగాణవీణ, తిరువనంతపురం**
లకేరళ రాజధాని తిరువనంతపురంలోని ప్రసిద్ధ పద్మనాభస్వామి ఆలయంలో 270 సంవత్సరాల తర్వాత అరుదైన మహా కుంభాభిషేకం నిర్వహించారు. పురాతన ఆలయంలో చాలా కాలంగా కొనసాగుతున్న పునరుద్ధరణ పనులు ఇటీవల పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో ఆదివారం ప్రత్యేకమైన పవిత్రోత్సవం జరిగింది. గర్భగుడి పైన ఉన్న మూడు గోపురాలు, విశ్వక్‌సేన విగ్రహాన్ని తిరిగి ప్రతిష్టించడం, తిరువంబడి కృష్ణ ఆలయంలో 'అష్టబంధ కలశం' ఏర్పాటు వంటి పూజా కార్యక్రమాలను ఆలయ పూజారులు నిర్వహించారు. ట్రావెన్‌కోర్ రాజకుటుంబం ప్రస్తుత అధిపతి మూలం తిరునాల్ రామ వర్మ, ఆ రాజకుటుంబ సభ్యుల సమక్షంలో ఈ క్రతువులు జరిగాయి.కాగా, పునరుద్ధరించిన ఆలయంలో ఆధ్యాత్మిక శక్తి బలోపేతం, ఆలయం పవిత్రతను తిరిగి పొందడం మహా కుంభాభిషేకం ప్రధాన ఉద్దేశమని ఆలయ అధికారులు తెలిపారు. మహా కుంభాభిషేకానికి వారం ముందు నుంచి ఆచార్య వరణం, ప్రసాద శుద్ధి, ధార, కలశం వంటి ఇతర ఆచారాలు నిర్వహించినట్లు చెప్పారు. మరోవైపు కేరళ గవర్నర్ విశ్వనాథ్ రాజేంద్ర అర్లేకర్ పద్మనాభస్వామి ఆలయాన్ని సందర్శించి ఈ అరుదైన ఆచారాన్ని వీక్షించారు. 270 ఏళ్ల తర్వాత నిర్వహించిన అరుదైన మహా కుంభాభిషేకాన్ని తిలకించేందుకు వేలాదిగా భక్తులు పోటెత్తారు. ఈ నేపథ్యంలో ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నాలుగు ప్రవేశ ద్వారాల వద్ద భారీ స్క్రీన్లపై పూజా క్రతువులను ప్రదర్శించారు.

## కొలంబియా అధ్యక్ష అభ్యర్థిపై కాల్పులు

-మిగ్యుల్ ఉరిబ్ పరిస్థితి విషమం
-ఖండించిన దేశ అధ్యక్షుడు గుస్తావో పెట్రో
-విచారణకు ఆదేశం




**తెలంగాణవీణ, బొగోటా**
కొలంబియా అధ్యక్ష అభ్యర్థి, సెనేటర్ మిగ్యుల్ ఉరిబ్ (39)పై కాల్పులు జరిగాయి. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్టు ప్రభుత్వం, ఆయన పార్టీ, స్థానిక మీడియా నివేదించాయి. పార్టీ ప్రకటన ప్రకారం.. శనివారం రాజధానిలోని ఫోంటిబాన్ పరిసరాల్లోని పబ్లిక్ పార్కులో మిగ్యులే ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అదే సమయంలో ఒక దుండగుడు ఆయనపై వెనక నుంచి కాల్పులు జరిపాడు. మిగ్యుల్‌ను వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఈ దాడిపై విచారణ చేపడుతున్నట్టు కొలంబియా రక్షణ మంత్రి పెడ్రో సాంచెజ్ తెలిపారు. ఒక అనుమానితుడిని అరెస్ట్ చేశామని అన్నారు.ఈ హింసాత్మక దాడిని నిష్పాక్షికంగా, తీవ్రంగా ఖండిస్తున్నట్టు కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మిగ్యుల్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. సమగ్ర దర్యాప్తునకు పిలుపునిచ్చారు. వచ్చే ఏడాది కొలంబియాలో అధ్యక్ష ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల్లో ప్రతిపక్ష కన్జర్వేటివ్ డెమోక్రటిక్ పార్టీ నుంచి అధ్యక్ష అభ్యర్థిగా మిగ్యుల్ పోటీ చేస్తున్నారు.




## పెండ్లికి వెళ్లిన బాలికలపై గ్యాంగ్ రేప్

నిందితులను అరెస్ట్ చేసిన ఒడిశా పోలీసులు



**తెలంగాణవీణ, గంజాం**
బీజేపీ పాలిత ఒడిశాలో పెండ్లి మండపం నుంచి ఇద్దరు బాలికలను నలుగురు వ్యక్తులు కిడ్నాప్ చేసి, సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. బ్రహ్మపూర్ ఎస్పీ శ్రావణ్ వివేక్ తెలిపిన వివరాల ప్రకారం ఈ దారుణం ఈ నెల 3న జరిగింది. విశాఖపట్టణానికి పారిపోయేందుకు ప్రయత్నిస్తున్న నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.బాధితుల్లో ఒకరి వయసు 14 ఏండ్లు, మరొకరి వయసు 15 ఏండ్లు. వారి కుటుంబ సభ్యులు ఈ నెల 4న పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం నలుగురు నిందితులు బాలికలపై సామూహిక లైంగిక దాడి చేసి, తీవ్రంగా కొట్టి, వదిలిపెట్టారు. బాధితులను ఈ నెల 6న వైద్య పరీక్షల కోసం పంపించారు. బాధితులు, నిందితులు ఒకే గ్రామానికి చెందినవారు.

## రష్యాపై ఉక్రెయిన్ డ్రోన్ల దాడి



**తెలంగాణవీణ, మాస్కో**
రష్యాపై ఉక్రెయిన్ డ్రోన్ దాడికి పాల్పడింది. ఈ దాడి కారణంగా రెండు కీలక విమానాశ్రయాలను మూసివేసినట్లు రష్యా అధికారులు తెలిపారు. భద్రత కోసం వ్నుకోవో మరియు డొమోడెడోవో విమానాశ్రయాల్లో విమానాల రాకపోకలను నిలిపివేసినట్లు రష్యా పౌర విమానయాన సంస్థ రోసావియాట్సియా పేర్కొన్నారు. ఆదివారం తెల్లవారుజామున 4.00 గంటల సమయంలో మాస్కో వైపు దూసుకువస్తున్న తొమ్మిది ఉక్రేనియన్ డ్రోన్‌లను రష్యా వైమానిక రక్ష విభాగాలు ధ్వంసం చేయాని మేయర్ సెర్గీ సోబ్యానిన్ తెలిపారు. ఉక్రెయిన్ డ్రోన్ దాడితో తులా ప్రాంతంలోని అజోట్ కెమికల్ ప్లాంట్‌లో స్వల్పకాలిక మంటలు చెలరేగాయని, ఇద్దరు సిబ్బంది గాయపడ్డారని అన్నారు. కలుగ ప్రాంతంలో ఏడు డ్రోన్లను కూల్చివేసినట్లు ప్రాంతీయ గవర్నర్ తెలిపారు. ఈ రెండు ప్రాంతాలు మాస్కోకు దక్షిణంగా, రాజధానికి సరిహద్దుగా ఉన్నాయి.

## సంపాదకీయం

# దక్షిణాదిన భాషా వివాదం, బిజెపి పాచిక

కమల్‌హాసన్, మణిరత్నం కాంబినేషన్లో దశాబ్దాల తర్వాత వచ్చిన సినిమా 'థగ్ లైఫ్' సరిగ్గా ఆడకపోయినా ఆ నేపథ్యంలో అనుకోకుండా వచ్చిన ఒక వివాదాన్ని మాత్రం బిజెపి బాగా పెద్దది చేస్తున్నది. కర్ణాటక తప్ప మిగిలిన దక్షిణాది రాష్ట్రాల్లో తనకంటూ పెద్ద పునాది లేని బిజెపి ఆ ఒక్కచోట మళ్లీ పుంజుకోవడానికి ఈ వివాదాన్ని సాధనంగా చూస్తున్నదా అని సందేహం కలుగుతుంది. అదే సమయంలో%శా%తమిళ, కన్నడ భాషల అనుబంధం గురించి కమల్‌హాసన్ చేసిన వ్యాఖ్యల నిజానిజాలు కూడా ప్రజలు ఆలోచిస్తున్నారు. ఆ అంశంలో మరింత స్పష్టత కోసం ప్రయత్నించవచ్చు. విమర్శించుకోవచ్చు. అంతేకానీ ప్రజల మధ్య, ప్రాంతాల మధ్య విభేదాలు, వివాదాలు పెంచాలని చూడటం మటుకు వాంఛనీయం కాదు. నటుడు ప్రకాష్‌రాజ్ లాగే కమల్‌హాసన్ కూడా– ప్రధానంగా తమిళనాడులో బిజెపి కూటమికి, దాని మత రాజకీయాలకు వ్యతిరేకంగా నిలబడుతున్న వ్యక్తి. మొదటి లోక్‌సభ ఎన్నికల్లో డిఎంకె కూటమిని బలపరిచి తన మక్కల్ నీది మయ్యం పార్టీని పోటీకి దూరంగా ఉంచారు. ప్రస్తుతం ఆయన తమిళనాడు ఇండియా వేదిక రాజ్యసభకు పంపిస్తున్నది. ఆయన మాటలపై మంట పెట్టడంలో బిజెపికి ఆ కడుపు మంట కూడా ఉంటుందనేది స్పష్టం. ప్రకాష్‌రాజ్ విషయంలోనైతే ఎప్పటికప్పుడు దాడి చూస్తూనే ఉంటాం. ఇంటింటికి సింధూరం తీసుకువెళ్తామని ఈ మధ్య మోడీ చేసిన వ్యాఖ్యపై ఆయన స్పందిస్తూ 'ఈ వృద్ధుడు కుంకుమ తీసుకుపోతే ఎవరు తీసుకుంటారని' ప్రశ్నించారు. భాషా పరంగా గాని, సంప్రదాయ కోణంలో కానీ ఈ మాటల్లో పెద్ద తప్పేమీ లేదు. అయినా అదేదో భారతీయ మహిళలను కించపరిచినట్టుగా రభస చేయడానికి విఫల యత్నం చేసింది.

### ప్రేమ పూర్వకంగానే

తన సినిమా ప్రమోషన్‌లో భాగంగా మీడియా షో నిర్వహించిన కమల్‌హాసన్ వాస్తవానికి బహు భాషా నటుడు. దక్షిణాదిన అన్ని భాషల్లోనూ ఆయన చిత్రాలు విజయవంతం కావడమే కాదు, 50 ఏళ్ల కిందటే హిందీలోనూ సత్తా చూపిన ప్రతిభావంతుడు. ఆ మాటకొస్తే ఆయన సమకాలికుడైన రజనీకాంత్ అసలు కన్నడ సీమ నుంచే వచ్చినవారు. కన్నడం, తమిళం ఒకటేనంటూ అనుబంధం చాటడానికి కమల్‌హాసన్ ఉత్సాహంలో తమిళం నుంచి కన్నడం పుట్టిందని భాషావేత్తలు చెప్పారని అన్నారు. ఆయన ఈ మాటలు అన్నప్పుడు పక్కన ప్రఖ్యాత కన్నడ హీరో రాజ్‌కుమార్ పుత్రుడైన శివరాజ్ కుమార్ కూడా ఉన్నారని గుర్తుంచుకోవాలి. కావేరి జలాలతో సహా రెండు రాష్ట్రాల మధ్య కొన్ని సమస్యలు ఉన్న మాట నిజమైనా అనుబంధం కూడా చాలా ఎక్కువ. తాను ఆ స్నేహభావాన్ని చాటడానికే మాట్లాడానని కమల్ పదే పదే వివరించారు. అయినా ఆయన కన్నడాన్ని అవమానించారని, క్షమాపణలు చెప్తే తప్ప సినిమా విడుదల కానీయబోమని ఈ వర్గాలు రభస సృష్టించాయి. ప్రధాన ప్రతిపక్షమైన బిజెపి ఈ వైఖరి తీసుకున్నప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కూడా కొంతవరకూ అదే తరహాలో మాట్లాడారు. వీటన్నిటి తర్వాత కమల్‌హాసన్ ఆ మాటలు వెనక్కు తీసుకుంటేనే ఆయన సినిమా కన్నడ వెర్షన్ విడుదలకు ఒప్పుకుంటామని కర్ణాటక ఫిలిం ఛాంబర్ షరతు పెట్టింది. తాను ప్రేమతో ఆ మాట అన్నాను తప్ప మరో విధంగా కాదని, ప్రేమ క్షమాపణలు చెప్పదని కమల్ స్పష్టీకరించారు. ఆశ్చర్యం ఏమంటే కర్ణాటక హైకోర్టు కూడా దీనిపై అవసరాన్ని మించి స్పందించడమే కాక క్షమాపణలు చెప్పి తీరాలని సూచించింది. మీరు ఏమైనా చరిత్రకారులా భాషానిపుణులా అని ఆగ్రహం వ్యక్తం చేసింది. సంస్కృతి, మతం పేరుతో కీలక పదవుల్లో ఉన్న నాయకులు రకరకాలుగా మాట్లాడినప్పుడు మిన్నకుండిపోయిన ఉన్నత న్యాయస్థానాలు సమస్య లేని చోట వివాదం పెంచే వ్యాఖ్యలు చేయడం ఇక్కడ గమనించవచ్చు. అయితే ఆయన తన చిత్రాన్ని కన్నడలో విడుదల చేయరాదని క్షమాపణల ప్రసక్తి లేదని ప్రకటించారు. అదే సమయంలో తన స్నేహపూర్వక వ్యాఖ్యలను వివరిస్తూ చాంబర్‌కు లేఖ కూడా రాశారు. ఈ లోగా ఇతర రాష్ట్రాలలో ఆ చిత్రం విడుదల, విఫలం కూడా సంభవించాయి.

### చరిత్ర వాస్తవాలేమిటి?

ఇంతకూ మనం ఆ వ్యాఖ్యలను ఎలా చూడాలి? దక్షిణాది భాషలైన తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం, తుళు ఒకే కుదురు నుంచి వచ్చాయని భాషావేత్తలు మొదటి నుంచీ భావిస్తున్నారు. అదే ఆది ద్రావిడ భాష. ఈ క్రమంలో ముందు తమిళ భాష విడిపోయిందని ఒక బలమైన అభిప్రాయం ఉంది. తమిళ భాషా సాహిత్య ఆధారాలు మిగిలిన వాటికంటే ప్రాచీన కాలం నుంచి లభ్యం కావడం ఇందుకు ప్రధాన కారణం. క్రీస్తుపూర్వం సంగం సాహిత్యం అనేది తమిళంలో తొలి వారసత్వంగా పరిగణిస్తారు. ఇందులో బౌద్ధ, జైన కథలు కూడా అనేకం ఉంటాయి. కన్నడంలో 8వ శతాబ్ది నుంచి సాహిత్యం లభిస్తున్నది. తెలుగుకు వస్తే 11వ శతాబ్ది నాటి నన్నయ్య భారతాన్ని ఆదికావ్యమంటూ ఇటీవల వరకు గొప్పగా చెప్పేవారు. 1000 ఏళ్ల తెలుగు సాహిత్యం అన్న మాట అలా పుట్టిందే. ఈ మూడు భాషలు ఒకదాని నుంచి ఒకటి వచ్చాయని చెప్పడానికి ఆధారాలు లేకపోయినా అన్ని ఒకే కుదురు అన్నది మాత్రం దాదాపు కచ్చితంగా ఒప్పుకున్నదే. భారతదేశంలోనే ప్రఖ్యాతిగాంచిన భాషావేత్త డాక్టర్ భద్రిరాజు కష్ణమూర్తి దగ్గర నుంచి పాశ్చాత్య పరిశోధకుల వరకు ఈ అంశాన్ని ధ్రువీకరించారు. బహుశా కమల్ ఉద్దేశం కూడా ఇదే అయి ఉండవచ్చు. అపార్థం ఉంటే సవరించుకోవచ్చు కానీ క్షమాపణలు, భాషా యుద్ధాలు అవసరమేముంది? తమిళనాడు సిపిఎం కార్యదర్శి షణ్ముగం ఒక సభలో మాట్లాడుతూ ఇదే చెప్పారు. తమిళనాడులో కాలూనితే చాలని, కర్ణాటకలో ఎలాగో మళ్లీ అధికారంలోకి రావాలని తంటాలు పడుతున్న బిజెపి దీన్ని కావాలనే పెద్దది చేస్తున్నది. వారికి తమిళనాడులో అవకాశం తక్కువ. పైగా అక్కడ కమల్ ప్రత్యర్థి శిబిరంలో వున్నారు. మొన్న లోక్‌సభ ఎన్నికల్లో 100 శాతం ఇండియా స్ట్రయిక్ రేట్‌కు కలసి వచ్చారు. ముందే చెప్పినట్టు లౌకికవాదంతో నిలబడుతున్న ఈ ప్రముఖ నటుల పట్ల ద్వేషం కూడా ఇందుకు కారణం అని చెప్పాలి.

# బడికి బాట పడుతుందా!



దశాబ్దాలుగా బడికి బాటలు వేయాలని హోరెత్తే నినాదాలతో, కార్యక్రమాలతో, ప్రచారాలతో ముందుకుపోతున్నా, ప్రభుత్వ బడులు కళకళలాడడంలేదనేది చేదైన విషయం. దీని ఫలితం సమాజంపైనా, భవితపైనా తీవ్రంగానే పడుతోంది. ప్రభుత్వ బడులు కళకళలాడడం అటుంచి, మూతపడి కనుమరుగవటం పెద్ద విషాదం. పెరుగుతున్న జనాభా ప్రకారం పెరగాల్సిన బడులు, ప్రభుత్వంలో మాత్రం తగ్గుతుంటే ప్రయివేటు వ్యాపార పాఠశాలలు మాత్రం రోజురోజుకు పెరుగుతున్నాయి. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రుల మానసిక ఆలోచనల్లో ప్రవర్తనల్లోనే పెద్ద మార్పు వచ్చింది. మానవ సంబంధాలపై కూడా తీవ్ర ప్రభావాన్ని కలుగచేసింది. కొనడం, అమ్మడం విలువల ఆధారంగానే మనుషుల మధ్య సంబంధాలు ఏర్పడుతున్నాయి. ఇది మనకు కనపడకుండా జరిగే మార్పు. ఇక బాధ్యత వహించాల్సిన ప్రభుత్వాలూ చేతులెత్తేయటం, భవిష్యత్ తరాలను తీర్చిదిద్దటంలో సమాజానికి బాధ్యత లేకపోవడం మూలాన అనేక అనర్థాలు పరిణమిస్తున్నాయి. ఇది లోతుగా ఆలోచించినపుడే బోధపడుతుంది.

ఇప్పుడవేవీ ఆలోచించే స్థితిలో ప్రభుత్వాలు లేవు. అయితే ప్రజలు, పౌరసమాజమూ అంతే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మరింత అనర్థం ఎదురవుతుంది. మానవ వనరులను మానవీయ మార్గంలో నైపుణ్యవంతంగా తీర్చడం, విలువల ప్రాతిపదికన అభివృద్ధి పరచడం అనేది ప్రభుత్వ ఆధీనంలోనే జరగాలి. జరుగుతుంది కూడా. కానీ ప్రభుత్వ ప్రాధాన్యతలు కూడా మారిపోయాయి. ప్రయివేటుకు ఊడిగం చేసే వ్యవస్థగా అదీ మారిపోయింది. అందుకనే కేంద్ర ప్రభుత్వం ప్రయివేటు విద్యావ్యాపారానికి అనుకూల నిర్ణయాలు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వమూ ప్రయివేటునే పెంచి పోషిస్తున్నది. విచ్చలవిడిగా ప్రయివేటు పాఠశాలలకు అనుమతులిస్తున్నారు. పాఠశాల నిర్వహణా ప్రమాణాలేవీ పట్టించుకోకుండానే ప్రయివేటు బళ్లు నడుస్తున్నాయి. కేవలం ఫలితాలు ఆధారంగానే బేరీజు వేస్తున్నారు. అయితే ఇందులో ప్రభుత్వ బడుల వైఫల్యమూ వుంది. దీనికి సవాలక్ష కారణాలున్నాయి. 'దేశభవిష్యత్తు తరగతి గదిలో రూపుదిద్దుకుంటుంద'ని కొఠారి కమీషన్ చెప్పిన విషయాన్ని ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. కేంద్ర ప్రభుత్వం విద్యారంగానికి కనీసంగా పదిశాతం నిధులు కేటాయించాలన్నదీ పట్టించుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వాలూ విద్యపట్ల అంతే నిర్లక్ష్యంగా ఉన్నాయి. మారుతున్న అవసరాలకనుగుణంగా విద్యా వ్యవస్థను మలచుకోవడంలో విఫలమవుతున్నాయి. ప్రభుత్వ బడులకు సౌకర్యాలు, వసతులు కల్పించడంలోనూ పెద్ద లోపాలున్నాయి. ఆడపిల్లలకు అన్ని పాఠశాలల్లో మూత్రశాలలు లేవు. తరగతికొక గదిని, గదికొక ఉపాధ్యాయున్ని, పర్యవేక్షకులను ఏర్పాటు చేసుకోలేకపోయాము. ఆవాసాలకు అందుబాటులో పాఠశాలల్ని నిర్మించడం అటుంచి, విద్యార్థులు తక్కువగా ఉన్నారనే నెపంతో ఉన్నవాటినే మూసేస్తున్నారు. ఫలితంగా విద్యార్థులు, ప్రభుత్వ బడులకు మధ్య అగాధం పెరుగుతోంది. విద్యార్థికి పాఠశాలను దూరంగా నెడుతున్నారు.

విద్యా విలువను గ్రహించిన సామాన్య ప్రజలు కూడా ప్రభుత్వ పాఠశాలలో, ప్రభుత్వ వైద్యశాలలో నాణ్యత ఉండదనే అభిప్రాయంలోకి వచ్చారు. పేదరికంలో ఉన్న ప్రజలు కూడా తమ జీవితాలనూ తాకట్టు పెట్టి మరీ ప్రయివేటువైపు మొగ్గు చూపుతున్నారు. రంగురంగుల భ్రమలు, ఆంగ్ల మోజు ఆకర్షణకు గురిచేస్తున్నది. పేదలను ఫీజుల భారం మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నది. ఇప్పటికి కూడా గ్రామీణ ప్రాంతంలో పేద సామాన్య ప్రజలు ప్రభుత్వ బడులనే ఆశ్రయిస్తున్నారు. 26,106 ప్రభుత్వ పాఠశాలలలో దాదాపు 17 లక్షల మంది విద్యార్థులు నమోదై ఉన్నారని తెలుస్తున్నది. అసలు విద్యార్థాలే చేరని పాఠశాలలూ వందల సంఖ్యలో ఉన్నాయని, వాటిని మూసివేసే ప్రమాదముందని తెలుస్తున్నది. బడులను మెరుగుపరచాలి. నాణ్యమైన విద్య దొరుకుతుం దనే విశ్వాసాన్ని తల్లిదండ్రులలో కలుగచేయాలి. ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు ప్రజలపైన కూడా ఉంది. అంతేకాదు ప్రభుత్వ విద్యా వ్యవస్థలో కీలక భాగస్వాములుగా ఉన్న ఉపాధ్యాయులపై మరింత ఎక్కువ బాధ్యత ఉంది.

ప్రొఎం జయశంకర్ గారి పేరు మీద నడుపుతున్న బడిబాట కార్యక్రమం కేవలం కార్యక్రమంగా కాకుండా బడి బయట ఉన్న పిల్లలను, డ్రాపౌట్స్‌ను, ప్రభుత్వ బడిలోకి చేర్పించే పనిని ప్రభుత్వం, అధికారులు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు, ప్రజలు ఉమ్మడిగా నిబద్ధతతో చేపట్టాలి. ప్రాథమిక పాఠశాలలలో ప్రీప్రైమరీ తరగతులు నిర్వహించాలి. ఆకర్షణీయ బోధనా పద్ధతులతో ఆధునిక విధానాలతో తరగతుల నిర్వహణలో బడులు సాగినపుడు ప్రభుత్వ బడులు కళకళలాడుతాయి. ప్రభుత్వాలూ చిత్తశుద్ధితో కృషి చేసినపుడే బడిబాట లక్ష్యం నెరవేరుతుంది.

# రూ.5 పార్లేజీ బిస్కెట్ గాజాలో రూ.2,400

**-విచ్చలవిడిగా బ్లాక్ మార్కెట్**

**-దారి మళ్లిన మానవతా సాయం**

**తెలంగాణవీణ, బిజినెస్ న్యూఢిల్లీ,**

భారత్‌లో అత్యంత చవకైన ఆహార పదార్థంగా, ప్రతి ఇంట పిల్లలు, పెద్దలు అంత్యంత ఇష్టంగా తినే పార్లే జీ బిస్కెట్లు యుద్ధంతో తల్లడిల్లుతున్న గాజాలో ఖరీదైన సరుకుగా మారిపోయాయి. మన దేశంలో 5 రూపాయలకు దొరికే బిస్కెట్ ప్యాకెట్ ద్రవ్యోల్బణం పతాక స్థాయికి చేరిన గాజాలో 500 రెట్లు ఎక్కువగా రూ. 2,400కి పెరిగి అది కూడా అత్యంత కష్టంగా లభ్యమవుతున్నది. గాజా నుంచి వైరల్ అయిన ఓ తాజా సోషల్ మీడియా పోస్టులో ఓ వ్యక్తి తన కుమార్తెకు అత్యంత ఇష్టమైన పార్లేజీ బిస్కెట్ ప్యాకెట్‌ను 24 యూరోలకు పైగా(రూ. 2,342) చెల్లించి కొన్నానని తెలిపాడు. చాలా సేపు ఎదురుచూసిన తర్వాత మొత్తమ్మీద ఈరోజు రవీఫ్‌కి ఇష్టమైన బిస్కెట్లు దొరికాయి. మామూలుగా 1.5 యూరోలకు అమ్మే బిస్కెట్లు 24 యూరోలకు పెరిగిపోయినప్పటికీ రవీఫ్ ఇష్టాన్ని కాదనలేకపోయాను' అంటూ మొహమ్మద్ జవాద్ అనే



వ్యక్తి పెట్టిన పోస్టు వైరల్ అయింది. 2023 అక్టోబర్‌లో ఇజ్రాయెల్, హమాస్ మధ్య యుద్ధం మొదలైన తర్వాత క్రమంగా గాజాలో ఆహారం అందుబాటులో లేకుండా పోయింది. ఈ ఏడాది మార్చి నుంచి మే 19 మధ్య కాలంలో పాలస్తీనాను ఇజ్రాయెల్ దిగ్బంధించడంతో అంతర్జాతీయ ఒత్తిడి మేరకు అత్యంత పరిమితంగా మానవతా సాయానికి సంబంధించిన ట్రక్కులను మాత్రమే గాజాలోకి అనుమతించింది. మానవతా సాయాన్ని రాజకీయ, ఉగ్రవాద గ్రూపు హమాస్ అడ్డుకుంటోందని ఇజ్రాయెల్ ఆరోపించింది. అయితే మే 27న గాజా హుమానిటేరియన్ ఫౌండేషన్(జీహెచ్‌ఎఫ్) సహాయం పంపిణీ కోసం సెక్యూర్ డిస్ట్రిబ్యూషన్ సైట్ అనే మోడల్‌ని ప్రవేశపెట్టింది. ఇది అమెరికా, స్విట్జర్లాండ్, ఇజ్రాయెల్ సంయుక్త మద్దతుతో ఏర్పాటు చేసిన మోడల్. రఫాలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో పాలస్తీనా పౌరులకు సరకులు అందచేస్తారు. ఇక్కడ లభించే సాయం కన్నా వెలుపల బ్లాక్ మార్కెట్‌కు తరలిపోయేదే అధికమన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఒక్క పార్లే జీ బిస్కెట్లు మాత్రమే కాదు అన్ని వస్తువుల ధరలు దాదాపు 500 రెట్లకు పైగా అధిక ధరతో బ్లాక్ మార్కెట్లో అమ్ముడు పోతున్నాయి. ఉత్తర గాజాలో జూన్ 6న బ్లాక్ మార్కెట్‌లో లభిస్తున్న వస్తువుల ధరలు ఈ ప్రకారం ఉన్నాయి.

# లాస్ ఏంజెలెస్‌లో ఆందోళనలు తీవ్రం

**-కార్ల దహనం.. వ్యర్థాలతో పోలీసులపై దాడి**

**-చట్టాన్ని అతిక్రమిస్తే ఊరుకోబోమన్న ట్రంప్**

**తెలంగాణవీణ, బిజినెస్ లాస్ ఏంజెలెస్,**

అక్రమ వలసదారుల ఏరివేతలో భాగంగా ఫెడరల్ అధికారులు చేపట్టిన దాడులతో లాస్ ఏంజెలెస్‌లో ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితులు రెండో రోజు కూడా కొనసాగాయి. శుక్రవారం లాస్ ఏంజెలెస్‌లో ఫెడరల్ అధికారులు జరిపిన దాడులతో నగరమంతా అట్టుడికిన సంగతి తెలిసిందే. అయితే శనివారం కూడా నగరంలో అదే పరిస్థితులు కన్పించాయి. ఫెడరల్ అధికారులకు స్థానికుల నుంచి తీవ్రస్థాయిలో



ప్రతిఘటన ఎదురవుతున్నది. స్థానికులకు విపక్ష డెమొక్రటిక్ పార్టీ మద్దతుదారులు, విదేశీయులు తోడవ్వడంతో ఒక్కసారిగా ఆందోళన తీవ్రరూపం దాల్చింది. ఆగ్రహంతో నిరసనకారులు ప్యాకింగ్ కార్డులు, కాంక్రీట్ వ్యర్థాలతో పాటు దొరికిన వస్తువులతో పోలీసులపై దాడికి ప్రయత్నించారు. పలు చోట్ల ఆందోళనకారులు కార్లను తగులబెడుతున్నారు. వారిని అడ్డుకునేందుకు పోలీసులు లాఠీచార్జి, టియర్ గ్యాస్ ప్రయోగంతో పాటు వారిని అరెస్ట్ చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

### వలసదారులను విడిచిపెట్టం

ఒక వైపు అక్రమ వలసదారుల ఏరివేతపై లాస్ ఏంజెలెస్‌లో తీవ్ర ప్రతిఘటన ఎదురవుతున్నా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తగ్గేదేలే అన్న తరహాలో వ్యవహరిస్తున్నారు. అక్రమ వలసదారులను విడిచిపెట్టేది లేదని ఆయన హెచ్చరించారు. 2 వేల మంది నేషనల్ గార్డ్స్‌ను మోహరించాలని అధికారులను ఆదేశించారు.

# అక్రమ నిర్మాణాలకు అడ్డాగా కాప్రా సర్కిల్ !



మీర్పేట్ డివిజన్ లోని మల్లాపూర్ ప్రధాన రహదారి పక్కనే వెలుస్తోన్న ఆదనపు అంతస్తుల నిర్మాణం



ఆగని అదనపు అంతస్తుల నిర్మాణం..

**-దబ్బులిచ్చుకో... షెడ్లు వేసుకో...**
**-నిబంధనలు గాలికి.... నిర్మాణాలు పైపైకీ..**
**-ప్రేక్షక పాత్రలో మున్సిపల్ సిబ్బంది...**
**-ఇష్టానుసారంగా నిర్మాణాలు.... చోద్యం చూస్తున్న అధికారులు...**

**తెలంగాణవీణ,కాప్రా...** అక్రమ నిర్మాణాలకు కాప్రా సర్కిల్ కేంద్రంగా మారింది. ఎక్కడ చూసినా నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తున్న భవనాలు, అదనపు అంతస్తులు, భారీ షెడ్లు అధికారుల నిర్లక్ష్యం, అవినీతికి అద్దం పడుతున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదని స్థానికలు ఆరొపిస్తున్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని ఏఎస్ రావునగర్, చర్లపల్లి, హెచ్‌బీ కాలనీ, మల్లాపూర్, నాచారం డివిజన్లలో అక్రమ సెల్లార్ల నిర్మాణాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. నివాస భవనాలకు అనుమతులు పొంది షెటర్లను ఏర్పాటు చేస్తున్నారు. గ్రౌండ్ ప్లస్ రెండు అంతస్తులకు అనుమతులు పొంది ఆదనపు అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదు. భవన రుషీ కాలనీ , కాప్రా హై టెన్షన్ లైన్ ప్రాంతాల్లో అదనపు అంతస్తుల దందా నిరాటంకంగా



చర్లపల్లి డివిజన్ లో వెలుస్తోన్న షెడ్డు నిర్మాణపనులు...

కొనసాగుతోంది. ఎటువంటి అదనపు అనుమతులు లేకుండా నిర్మాణం పూర్తయ్యాక, అధికారులు కళ్ళు మూసుకోవడంతో అక్రమార్కులు యథేచ్ఛగా నిర్మాణాలకు కొనసాగిస్తున్నారు. కేవలం బహుళ అంతస్తుల భవనాలే కాదు, కాప్రా పరిధిలో భారీ షెడ్ల నిర్మాణాలు కూడా అధికమయ్యాయి.

**షెడ్ల నిర్మాణాలకు అనుమతులేవి ?**

వాణిజ్య అవసరాల కోసం, గోదాములకు అనుమతులు లేకుండా పెద్దపెద్ద షెడ్లను నిర్మిస్తున్నారు. చర్లపల్లి డివిజన్ లోని సీపెట్ వెనుక షెడ్డు నిర్మాణం జరుగుతున్నా అధికారులు మాత్రం ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు. అయితే షెడ్ల నిర్మాణారులు మున్సిపల్ సిబ్బందితో ఒప్పందం కుదుర్చుకుని యథేచ్ఛగా నిర్మణ పనులు చేపడుతున్నా సిబ్బంది పట్టించుకోవటం లేదు. పైగా ఉచిత సలహాలచ్చి ప్రొత్సహిస్తున్నట్లు తెలుస్తోంది. గోడల నిర్మాణం జరుగుతుండగానే వైట్ వాష్ వేసుకుంటూ పనులు కొనసాగిస్తున్నా మున్సిపల్ సిబ్బంది పట్టించుకోకపోవటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఫిర్యాదు చేసినా తమకేమి పట్టనట్లు వ్యవహరించడం మున్సిపల్ అధికారులకు సర్వసాధారనమేనని పలువురు విమర్శిస్తున్నారు.

**అధికారుల నిర్లక్ష్యం ..అవినీతి ఆరోపణలు:**

కాప్రాలో అక్రమ నిర్మాణాలు ఇబ్బడిముబ్బడిగా పెరగడానికి అధికారుల నిర్లక్ష్యమే స్థానికులు ఆరొపిస్తున్నారు. అక్రమ నిర్మాణదారుల నుంచి ముడుపులు ముట్టడంతో , అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అందినప్పటికీ, అధికారులు చర్యలు తీసుకోవడం లేదని, ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లు ఉన్నాయని చెబుతున్నారు. కొందరు అధికారులు, ప్రజాప్రతినిధులు అక్రమ నిర్మాణదారుల నుంచి లక్షల్లో వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. “తిలా పాపం తలా పిడికెడు” అన్న చందంగా టౌన్ ప్లానింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు వాటాలు పంచుకుంటున్నారని విమర్శలున్నాయి. కాప్రాలో అక్రమ నిర్మాణాలను అరికట్టడానికి జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు.

# యువత స్వశక్తితో రాణించాలి

**-కౌకుట్ల చంద్రారెడ్డి**





**తెలంగాణవీణ,కీసర...** నాగారం మున్సిపల్ పరిధిలోని సత్యనారాయణ కాలనీలో ప్రముఖ గృహ ఇంటీరియల్ డిజైన్ సంస్థ ‘ఎజే ఇంటీరియర్స్’ కార్యాలయాలన్ని మున్సిపల్ మాజీ ఛైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగాలపై ఆధారపడకుండా యువత స్వయం కృషితో ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. తమ కాళ్లపై నిలబడి, మరో పది మందికి ఉపాధి కల్పించాలనే ఆలోచనతో చక్కటి డిజైనర్ వృత్తిని ఎంచుకున్న డి. ఆంజనేయులు, వారి సోదరుడు డి. కృష్ణ ను అభినందించారు. యువతకు ఆదర్శంగా నిలిచినందుకు వారిని ప్రశంసించారు. ఉన్నత విద్య పూర్తి చేసుకున్న యువత వివిధ వృత్తి రంగాలలో నైపుణ్యం సాధించి, తమ కాళ్ల మీద నిలబడే శక్తిని పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బి.జి. శ్రీనివాస్ గౌడ్, బి.జె.పి. నాయకులు రామక్కపేట రవీందర్ రెడ్డి, వోల్లాల శ్రీనివాస్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, బి. సురేందర్ రెడ్డి, ఎం. శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

# క్రీడాకారులు క్రమశిక్షణతో మెలగాలి

**-ఇంటర్నేషనల్ బ్యాట్మెంటన్ క్రీడాకారుడు గురు సాయి దత్**




**తెలంగాణవీణ,ఉప్పల్ :** క్రీడాకారులందరూ క్రమశిక్షణతో మెలగాలని ఇంటర్నేషనల్ బ్యాట్మెంటల్ క్రీడాకారుడు గురుసాయి దత్ అన్నారు. ఆదివారం ఉప్పల్ భగయత్ లోని ఈ లైట్ విక్రాంత్ బ్యాట్మెంటల్ అకాడమీలో నిర్వహించిన రంగారెడ్డి జిల్లా బ్యాట్మెంటన్ జిల్లా స్థాయి బ్యాట్మెంటన్ ఛాంపియన్ షిప్ ముగింపు కార్యక్రమానికి ఆయనతో పాటు నేషనల్ క్రీడాకారుని దీప్తి రెడ్డి, జనరల్ సెక్రటరీ బిఏవిడి యు వి ఎన్ బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని విద్యార్థులకు క్రీడల పై ఆసక్తి కలిగేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు విజ్ఞానం పెంచుతుందని వివరించారు. ఈ టోర్నీకి రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ఆనంద్ బాబు, కార్యదర్శి శ్రీనివాస్ రావు, సంయుక్త కార్యదర్శి సాయి రెడ్డి, ప్రభాకర్ రెడ్డి వెంకటేష్ గుప్తా సత్యం ఫణి కిషోర్ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం టోర్నీలో గెలుపొందిన క్రీడాకారులకు ముఖ్య అతిథులు బహుమతులను అందజేశారు.

# ఘనంగా చిన్నక్రాంతి కాలనీ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం..





**-కాలనీ అభివృద్ధికై పాటుపడుతా... బింగి యోగేష్ యాదవ్**

**తెలంగాణ వీణ/నాచారం:** గత మూడు సంవత్సరాలుగా జరగని ఎన్నికలను చెంగిచర్ల చిన్న క్రాంతి కాలనీ వాసులు మొత్తం ఏకమై జరిపించడం చాలా శుభసూచకం అని బింగి యోగేష్ యాదవ్ అన్నారు.గత వారం రోజుల క్రితం ముగిసిన కాలనీ ఎన్నికల్లో గెలుపొందిన అధ్యక్ష,కార్యదర్శి,ట్రెజర్ల ప్రమాణ స్వీకారం ఆదివారం నిర్వహించారు.ఈ ప్రమాణ స్వీకారానికి బోడుప్పల్ మాజీ డిప్యూటీ నియర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ చందర్ గౌడ్, మాజీ కో-ఆప్షన్ నెంబర్ రంగ బ్రహ్మన్న గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొత్త ప్రభాకర్ గౌడ్, బోడుప్పల్ బిజెపి ఈస్ట్ జోన్ అధ్యక్షులు ఏర్పుల మహేష్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాసాల కుమార్ యాదవ్, కాంగ్రెస్ యువ నాయకులు బింగి యోగేష్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.



అనంతరం వారు మాట్లాడుతూ చుట్టుపక్కల కాలనీ వాసులకు రెండుసార్లు కాలనీ ఎన్నికలు జరిగాయి,కానీ చిన్న క్రాంతి కాలనీలో కొన్ని విభేదాల వల్ల నిర్వహించక పోవడంతో కాలనీ వాసులు మొత్తం ఏకమై ఏ ఒక్క రాజకీయ నాయకుని ప్రమేయం లేకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరుపుకోవడం చాలా ఆనంద దాయకం. ఎన్నికల్లో గెలుపు, ఓటమిలు సహజం, కాబట్టి ఓడిపోయిన వారు కృంగిపోకుండా, గెలిచిన వారికి సహకరించి కాలనీ అభివృద్ధిలో తోడ్పాటుగా నిలవాలని సూచించారు. కాలనీ అభివృద్ధి విషయంలో గెలుపొందిన కమిటీ సభ్యులు, కాలనీ వాసులను కలుపుకొని సమస్యలపై బోడుప్పల్ అధికారులకు వినతి పత్రాలు అందించినట్లయితే వాటిని నెరవేర్చే దిశగా మా వంతు మేము కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రధానంగా ఉన్నటువంటి డ్రైనేజీ, రోడ్లు, నీటి సమస్యలను పరిష్కరించాలని గెలుపొందిన కమిటీ సభ్యులు నాయకుల దృష్టికి తీసుకువెళ్లారు. దాంతో పాటుగా చిన్న క్రాంతి కాలనీకి కాలనీ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు.నాయకులు సానుకూలంగా స్పందించారు.

# హైదరాబాద్ జిల్లా బ్యాట్మెంటన్ చాంప్స్ దీక్ష శ్రీ, మాన్య అగర్వాల్




**తెలంగాణవీణ,హైదారాబాద్ :** విద్యార్థులను క్రీడలపై ఆసక్తి కలిగేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉందని బ్యాట్మెంటన్ అసోసియేషన్ హైదరాబాద్ జనరల్ సెక్రెటరీ కానూరు వంశీధర్ అన్నారు. ఆదివారం బండ్లగూడలోని గేమ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహించిన హైదరాబాద్ జిల్లా బ్యాట్మెంటన్ పోటీలు ముగిశాయి. అందులో భాగంగా అండర్ 15 గర్ల్స్ క్యాటగిరి డబుల్ లో దీక్ష శ్రీ, మాన్య అగర్వాల్ గోల్డ్ మెడల్ సాధించారు. అండర్ 15 సింగిల్స్ లో మాన్వి అగర్వాల్ గోల్డ్ మెడల్ సాధించింది. ఈ మేరకు ఆర్ ఆర్ సి చీఫ్ కోచ్ నాగరాజు తో పాటు క్రీడాకారులు అభినందించారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న త్రిష దామోదర్

**ఆందోల్ ప్రజలకు అండగా నేనుంటా**

**త్రిష దామోదర్**





**తెలంగాణ వీణ...**

ఆందోల్ నియోజకవర్గం మునిపల్లి మండలం ఖమ్మంపల్లి గ్రామం లో ఎస్సీ కాలనీలో పది సంవత్సరాలుగా తాగేందుకు నీళ్లు సదుపాయం లేక ఇబ్బంది పడ్డారు ముఖ్యంగా మహిళలు నీరు లేక కష్టమైన పరిస్థితులు ఎదురుకోవాల్సి వచ్చింది . అప్పుడు ఆ గ్రామంలో ఎలక్షన్ ప్రచార భాగంలో అక్క మాకు తాగి ఎందుకు చాలా ఇబ్బందిగా ఉంది అని చెప్పిన గ్రామస్తులు అప్పుడు త్రిష దామోదర్ నేను మీకు మాటిస్తున్నాను బోరు వేయించడం నా బాధ్యత అని తెలిపారు, ఇచ్చిన మాట కోసం ఖమ్మం పల్లి గ్రామంలో బోర్ వెయ్యడం జరిగింది, దాంతో ఖమ్మం పల్లి గ్రామస్తులు త్రిష దామోదర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు, ఈ కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేసేందుకు సహకరించిన మండల మరియు గ్రామ పెద్దల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కు త్రిష దామోదర్ ధన్యవాదాలు తెలియజేశారు

# కాంగ్రెస్ పార్టీ హటావో రేవంత్ రెడ్డి హటావో..బంజారా బచావో..

**-సిగ్గు శరం ఉంటే ఎమ్మెల్యే ఎమ్మెల్యే ,ఎంపీ, ఎమ్మెల్సీ పదవులకు లంబాడీ ప్రజా ప్రతినిధులు రాజీనామా చేయాలి**

**-లంబాడీలను మోసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్**

**తెలంగాణ వీణ/ఓయూ:**

ఎమ్మెల్యే రామచంద్రు నాయక్ కి డిప్యూటీ స్పీకర్ అంటే చేతికి ఆరో వేళ్ళు లాగా .. రామచంద్రు నాయక్ ఆ పదవిని స్వీకరించకూడదు అని హెచ్చరిక డాక్టర్ కరాటే రాజు నాయక్ గిరిజన చైతన్య వేదిక - ఓయూ జాక్ చైర్మన్ .. బీ ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడుతెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న లంబాడీ సామాజిక వర్గాన్ని మంత్రి వర్గంలో స్థానము కల్పించకపోవడం లంబాడీలను అవమానించడమే.. లంబాడీలను కాంగ్రెస్ పార్టీ చాలా చిన్న చూపు చూస్తుందని మండిపడ్డపడ్డారు ఈరోజు గిరిజనులకు లంబాడి సామాజిక వర్గానికి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యంగా సమైక్య ఆంధ్రలో తెలంగాణ ప్రజలకు ఏరకంగా అయితే ద్వితీయ శ్రేణి పౌరులు గా చూశారో ఈ రోజు కాంగ్రెసు పాలనలో రేవంత్ రెడ్డి లంబాడీ సామజిక వర్గాన్ని తృతీయా శ్రేణి పౌరులుగా చూస్తున్నారు, ..ముఖ్యంగా లంబాడీల ఓట్లు తోనే లంబాడీల భిక్ష తో ముఖ్యమంత్రి సీటు ఎక్కి లంబాడీలకు మంత్రివర్గంలో స్థానం కల్పించకపోవడం దారుణమని బీ ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడి గిరిజన చైతన్య వేదిక ఓయూ జాక్ చైర్మన్ డాక్టర్ కరాటే రాజు నాయక్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు ఈరోజు లంబాడీలను ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత లంబాడీలను తృతీయ శ్రేణిగా పౌరులుగా చూస్తా ఉన్నారు తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న లంబాడి సామాజిక వర్గాన్ని ఈరోజు మంత్రివర్గంలో స్థానం కల్పించకపోవడం లంబాడీలకు అవమానం చేసినట్లే కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లంబాడి సామాజిక వర్గానికి చెందినటువంటి ఎమ్మెల్యేలు తక్షణమే తమ పదవులకు రాజీనామా చేసి పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ ముఖం మీద ఉమ్మేసి బయటికి రావాలని హెచ్చరిస్తా ఉన్నాం రాష్ట్రంలో ఎక్కువ జనాభా ఉన్నటువంటి లంబాడి సామాజికవర్గాన్ని మంత్రివర్గంలో స్థానం కల్పించకపోవడం లంబాడి సామాజిక వర్గాన్ని అవమానం చేసినట్టే, డిప్యూటీ స్పీకర్ పదవీ చేతికి ఆరో వేళ్ళు లాంటిది గిరిజనులకు మంత్రి పదవి భిక్ష కాది అది హక్కు..ఈ కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ చేతిలో రాజ్యాంగం పట్టుకుని అందరూ సమానమనే సామజిక న్యాయం కాంగ్రెస్ తో సాధ్యమని చెప్పి తెలంగాణ లో అత్యదిక జనాభా ఉన్న లంబాడీలకు మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాహుల్ గాంధీకి గిరిజన సమాజం లంబాడి సమాజం ప్రశ్నిస్తుంది, అందుకే కాంగ్రెస్ పార్టీ హటావో లంబాడీలను బచావో కాంగ్రెస్ పార్టీ హటావో బంజారా బచావో రేవంత్ రెడ్డి హటావ్ బంజారా జాతి బచావో నినాదంతో భవిష్యత్తు కాలంలో కార్యక్రమాలు చేపడతామని కాంగ్రెస్ పార్టీలో ఉన్నటువంటి లంబాడి సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు ఎంపీ లు ఎమ్మెల్సీ మరియు ఇతర పార్టీ పదవులకు తమ పదవులకు రాజీనామా చేసి బయటికి రావాలని హెచ్చరించారు, రాజీనామా చేయకపోతే తాండాలలో తండా పొలిమేరలో కూడా దాటనివ్వమని హెచ్చరిస్తా ఉన్నాం. మిమ్మల్ని తాండ నుంచి గిరిజన



సమాజం నుంచి బహిష్కరణ గురి చేయాల్సి వస్తుందని హెచ్చరిస్తా ఉన్నాం. మీకు సిగ్గు శరం ఉంటే గిరిజన ప్రజల పైన ప్రేమ ఉంటే ఆ పార్టీ పదవులకు వెంటనే రాజీనామా చేయాలి ఎమ్మెల్యేలకు కార్పొరేషన్ చైర్మన్ లకు ఎమ్మెల్సీ పదవీకి ఎంపీ పదవులకు రాజీనామా చేసి గిరిజన సమాజంలోకి ప్రజాక్షేత్రంలోకి రావాలని కోరుకుంటున్నాం, మీరు రాజీనామా చేయకపోతే మిమ్మల్ని కచ్చితంగా ప్రజాక్షేత్రంలో బొంద పెడుతాం అని హెచ్చరిస్తున్నాం, గిరిజనులు ఈరోజు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి అధికారంలోకి తీసుకొస్తే తెలంగాణ రాష్ట్రంలో గిరిజనులకు అనేక ఇబ్బందులు కల్పిస్తూ అవమానాల గురిచేస్తూ ఎక్కడ చూసినా గిరిజనుల పైన దాడులు గిరిజన భూములు లాక్కోవడం గిరిజనుల పైన అత్యాచారం చేయడం గిరిజన రైతులను జిల్లాలో పెట్టడం గిరిజన ఉద్యోగులపై కక్ష సాధింపు చేయడం గిరిజన నిరుద్యోగులను జైల్లో పెట్టడం ఇదేనా ఇందిరమ్మ రాజ్యం అని ప్రశ్నిస్తున్నాం కాంగ్రెస్ పార్టీ కుట్రలను గిరిజన సమాజం ఇప్పటికైనా అర్థం చేసుకున్నది.. కేసీఆర్ ముఖ్యమంత్రి గా ఉన్న రెండు సార్లు లంబాడీల కు మంత్రి పదవులు ఇచ్చి లంబాడీలకు పెద్ద పీట వేశారని చెప్పారు.. ఈ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లంబాడీల ఆస్తులను కొల్లగొట్టి ప్రశ్నించే బంజారా బిడ్డలను, బంజారా రైతులను, బంజారా ఉద్యోగులను, బంజారా నిరుద్యోగ యువతకు జైల్లో పెడుతూ గిరిజన డిక్లరేషన్ ఇదే అని హుకుం జారీ చేసినట్లు ఉంది.. దీనిపై కచ్చితంగా బంజారా ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు..

# సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

**సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్.గిరిధర్ రెడ్డి**

**-కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డా.సిద్దం.ఉజ్వల్ రెడ్డి**

**ఇందిరమ్మ ఇండ్లకు శంకుస్థాపన??**



**తెలంగాణ వీణ,జహీరాబాద్...**

రాష్ట్రంలోని ప్రతి పేదవారికి సొంత ఇంటికల నెరవేరాలని ముఖ్యమంత్రి గౌ.శ్రీ.ఎ.రేవంత్ రెడ్డి గారి ముఖ్య లక్ష్యమని సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి అన్నారు. మొగడంపల్లీ మండలంలోని జాడిమల్కాపూర్ గ్రామంలో ఆదివారం సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డా.సిద్దం.ఉజ్వల్ రెడ్డితో కలిసి ఇందిరమ్మ ఇండ్ల శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన భూమి పూజలో వారు పాల్గొని కొబ్బరికాయ కొట్టి,పునాదులు తీసి పనులు ప్రారంభించారు.ఈకార్యక్రమంలో సిడిసి చైర్మన్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు,యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షులు,మాజీ యం.పి,పి,మాజీ యం.పి.టి.సిలు,మాజీ సర్పంచ్ లు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాఘవేంద్ర నగర్ లో ప్లే స్కూల్ లిటిల్ మిలీనియం ను లాంఛనంగా ప్రారంభించిన కార్పొరేటర్ బన్నాల






**తెలంగాణ వీణ,ఉప్పల్...**

చిల్కానగర్ డివిజన్లోని రాఘవేంద్ర నగర్ కాలనీలో లిటిల్ మిలీనియం ప్లే స్కూల్ ని ముఖ్య అతిథులుగా విచ్చేసి లాంచనంగా ప్రారంభించిన చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్.అనంతరం గీత ప్రవీణ్ మాట్లాడుతూ ప్లే స్కూల్ ను ఏర్పాటు చేసిన స్కూల్ కరస్పాండెంట్ మహేష్ ప్రియాంక ను అభినందిస్తూ మంచి ఉద్దేశంతో ప్లే స్కూల్ ని ఏర్పాటు చేశారని పిల్లలు చిన్న వయసు నుంచే మంచి అలవాటులను నేర్పుతూ ప్రోత్సహించాలని మంచి నడవడి నేర్పాలని, తల్లిదండ్రులను గౌరవించే విధంగా ప్రతి స్కూల్లో టీచర్లు బోధించాలని, అదేవిధంగా యువత ప్రభుత్వ ఉద్యోగాల గురించి వేచిచూసే తరుణంలో మహేష్ లాంటి వాళ్లు సొంతంగా వారి కాళ్ళ పైన వాళ్ళు నిలబడాలన్న గొప్ప సంకల్పంతో సొంత డబ్బులతో ప్లే స్కూల్ ఏర్పాటు చేసుకొని తనకు తాను పనిని కల్పించు కోవడమే కాక నలుగురికి పని కల్పించే విధంగా ఆలోచించినందుకు వారిని నిజంగా అభినందిస్తున్నానని కొని యాడారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ సీనియర్ నాయకులు కోకొండ జగన్, కాంగ్రెస్ నాయకులు బజార జగన్ గౌడ్, బిజెపి సీనియర్ నాయకులు బోరంపేట్ మురళి, బీఆర్ఎస్ నాయకులు ఉదయ్, ఎడ్యుకేషన్ ఈస్ట్ మల్లయ్య, కాలనీ అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, కాలనీ సభ్యులు యాకోబు రెడ్డి, కృష్ణారెడ్డి, విట్టల్ రెడ్డి, కృష్ణయ్య, సత్యనారాయణ గౌడ్, స్కూలు యాజమాన్యం పేరెంట్స్ పిల్లలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నూతన వస్త్రాధారణ వేడుకల్లో పాల్గొన్న టిఎస్ఎస్ సిసిడిసి (ఎస్సి కార్పొరేషన్) మాజీ చెర్మెన్ వై.నరోత్తం..

**తెలంగాణ వీణ,జహీరాబాద్**



జహీరాబాద్ పట్టణంలోని బసవేశ్వర ఫంక్షన్ హాల్ లో ఈ రోజు జరిగిన ఝరాసంఘం మండలం బిడకన్నె గ్రామం పి.వీర్ సంగప్ప మనుమళ్లు,మనవరాలు నూతన వస్త్రాధారణ వేడుకల్లో టిఎస్ఎస్ సిసిడిసి (ఎస్సి కార్పొరేషన్) మాజీ చెర్మెన్ వై.నరోత్తం పాల్గొని చిన్నారులను ఆశీర్వదించి,శుభాకాంక్షలు తెలియజేశారు, ఈ వేడుకల్లో మాజి ఎంపీటీసీ పి.నాగిశెట్టి, వీరన్న,చంద్రశేఖర్, యం.జైపాల్,శికారి గోపాల్,చెంగల్ జైపాల్,తదితరులు పాల్గొన్నారు

# అక్రమ నిర్మాణాలపై ఎవరైనా ఫిర్యాదు చేయెొచ్చు...!

**-తేల్చి చెప్పిన తెలంగాణ హైకోర్టు...!**

**తెలంగాణ వీణ,హైదరాబాద్...**

అక్రమ నిర్మాణాలపై ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చునని హైకోర్టు తీర్పు చెప్పింది.ఆపరిచితుడి నుంచి దారినపోయే దానయ్య వరకు ఎవరైనా ఒకరు ఫిర్యాదు చేయవచ్చునని తేల్చి చెప్పింది. అక్రమ నిర్మాణాల బాధితుడే ఫిర్యాదు చేయాలని ఏమీ లేదని స్పష్టంచేసింది. బయట వ్యక్తి అంటే నేరుగా బాధితుడు కాని వ్యక్తి ఫిర్యాదు చేశాక అధికారుల నుంచి స్పందన లేకపోతే హైకోర్టును ఆశ్రయించవచ్చునని చెప్పింది. ఈ మేరకు జస్టిస్ టీ వినోద్‌కుమార్ ఇటీవల తీర్పు వెలువరించారు. హైదరాబాద్, బేగంపేట బీఎస్ మక్తాలో 400 చదరపు గజాల్లో అనుమతి లేకుండా



నిర్మించిన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని గతంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలంటూ చేగూరి అనిత ఆండాళ్లు పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్, ఆమె కొడుకు 200 గజాల చొప్పున స్థలాలను కొనుగోలు చేసి విడివిడిగా రెండంతస్థుల నిర్మాణాలకు అనుమతి తీసుకుని ఆ తర్వాత 400 చదరపు గజాల్లో గ్రౌండ్ ఫ్లోర్‌తో కలిపి 4 అంతస్థుల నిర్మాణాలకు అనుమతులను సవరించారని న్యాయవాది చెప్పారు.భవన పటిష్టత, వాస్తు వంటి పేరుతో అయిదో అంతస్థు నిర్మించారని వివరించారు. ఆపై క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఆ ప్రాంతానికి సంబంధం లేని, బాధితుడు కాని నరేందర్ అనే వ్యక్తి పిటిషన్ వేస్తే హైకోర్టు గతంలో ఉత్తర్వులు ఇచ్చిందని, వాటిని రద్దు చేయాలని కోరారు. వాదప్రతివాదనలు విన్న తర్వాత.. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేయడానికి బాధితుడై ఉండకర్లేదని, ఎవరైనా సంబంధంలేని వ్యక్తి కూడా ఫిర్యాదు చేయవచ్చునని న్యాయస్థానం వెల్లడించింది. పిటిషనర్ చేసుకున్న క్రమబద్ధీకరణ దరఖాస్తుపై ప్రవీణ్‌కుమార్ కేసులో ఇదే హైకోర్టు వెలువరించిన తీర్పులోని మార్గదర్శకాల మేరకు వ్యవహరించాలని జీహెచ్ ఎంసీని ఆదేశించింది. పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది.

# బిజినెస్

## మహిళలకు గుడ్‌న్యూస్.. భారీగా తగ్గిన బంగారం ధరలు..!



**తెలంగాణవీణ, బిజినెస్**
బంగారం ధరల్లో ప్రతి రోజు హెచ్చు తగ్గులు చోటు చేసుకుంటున్నాయి. ఒక రోజు తగ్గితే మరో రోజు పెరుగుతుంది. ఇక బంగారానికి మహిళలు అత్యంత ప్రాధాన్యత ఇస్తుంటారు. పసిడి భారత దేశ సంస్కృతిలో ఓ ప్రత్యేక స్థానముంది. మిగిలిన దేశాలతో పోల్చుకుంటే మన భారతదేశంలోనే ఎక్కువ బంగారం కొనుగోళ్లు చేస్తుంటారు. ధరలు ఎంత పెరిగినా ఏ మాత్రం తగ్గరు. మరీ ముఖ్యంగా ఆడవాళ్లు బంగారం వైపు ఎక్కువ మొగ్గుచూపుతూ ఉంటారు. అన్ని శుభకార్యాల్లో బంగారానికి అధిక ప్రాధాన్యత ఇస్తుంటారు. అలాంటి బంగారం ధరలు గత కొన్ని రోజులనుంచి చుక్కలు చూపిస్తున్నాయి. ఇక జూన్ 8వ తేదీన బంగారం ధరలు భారీగా తగ్గాయి. నిన్నటి ధరలతో పోల్చుకుంటే తులం బంగారంపై ఏకంగా రూ.1600కుపైగా తగ్గుముఖం పట్టింది. ఇటీవల లక్ష రూపాయలు దాటి బంగారం ధర.. క్రమంగా దిగి వచ్చింది. మళ్లీ లక్షకు చేరువలో ఉండగా, ఈ రోజు మాత్రం భారీగానే దిగి వచ్చింది.
హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 97,970 రూపాయల వద్ద ట్రేడవుతోంది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర 89,000 రూపాయల వద్ద ఉంది. ఇక ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బ ంగారం ధర 98,120 రూపాయలు ఉండగా, 22 క్యారెట్ల తులం ధర 89,950 రూపాయలు ఉంది.
ఇక ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 97,970 రూపాయల వద్ద ట్రేడవుతోంది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల ధర 89,000 రూపాయల వద్ద ఉంది. బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 97,970 రూపాయల వద్ద ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ధర 89,800 వద్ద కొనసాగుతోంది. ఇక వెండి విషయానికొస్తే కిలో వెండి ధర లక్షా 8 వేల రూపాయల వద్ద ఉంది. మరికొన్ని ప్రాంతాల్లో లక్షా 18 వేల వరకు ఉంది. అయితే ఈ ధరలు రాష్ట్రాలను బట్టి మారుతూ ఉంటుంది.

## రేర్ ఎర్త్స్ ఎగుమతులపై చైనా ఆంక్షలు.. స్విఫ్ట్ కార్ల ఉత్పత్తిని నిలిపివేసిన సుజుకీ..!

**తెలంగాణవీణ, బిజినెస్**
జపాన్‌కు చెందిన ప్రముఖ ఆటో మొబైల్ కంపెనీ సుజుకీ మోటార్స్ కీలక నిర్ణయం తీసుకున్నది. కంపెనీకి చెందిన పాపులర్ మోడల్ కార్ స్విఫ్ట్ ఉత్పత్తిని తాత్కాలికంగా నిలిపివేసింది. చైనా సర్కారు రేర్ ఎర్త్ పదార్థాల ఎగుమతులపై ఆంక్షలు విధించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఆంక్షల కారణంగా విడిభాగాలు లభించకపోవడంతో ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు తెలుస్తున్నది. చైనా రేర్ ఎర్త్స్ ఎగుమతులపై ఆంక్షలు అమలు చేయడం వల్ల ప్రభావితమైన తొలి ఆటోమొబైల్ కంపెనీ సుజుకీ. స్విఫ్ట్ సబ్‌కాంపాక్ట్ మోడల్ (స్విఫ్ట్ స్పోర్ట్ మినహా) ఉత్పత్తిని మే 26 నుంచి జూన్ 6 వరకు నిలిపివేస్తున్నట్లు కంపెనీ గతంలోనే ప్రకటించింది. విడిభాగాల కొరత కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అప్పట్లో తెలిపింది.అయితే, కొరతకు



దారితీసిన కారణాలపై మాత్రం స్పందించలేదు. ఉత్పత్తి నిలిపివేతకు సంబంధించిన కారణాలపై స్పందించేందుకు కంపెనీ ప్రతినిధి నిరాకరించినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై అంతర్జాతీయ మీడియా సంస్థ కథనం ప్రచురించింది. ఏప్రిల్ నెలలో చైనా ప్రభుత్వం అనేక రకాల రేర్ ఎర్త్ పదార్థాలు, వాటితో ముడిపడిన అయస్కాంతాల ఎగుమతులను నిలిపివేసింది. దాంతో ప్రపంచవ్యాప్తంగా ఆటోమొబైల్ తయారీ సంస్థలు, ఏరోస్పేస్ కంపెనీలు, సెమీకండక్టర్ల తయారీదారులు, సైనిక కాంట్రాక్టర్ల సరఫరా వ్యవస్థలపై చైనా నిర్ణయం తీవ్ర ప్రభావం పడుతున్నది. రేర్ ఎర్త్ పదార్థాలు అనేక కీలకమైన ఎలక్ట్రానిక్, మాగ్నెటిక్ భాగాల తయారీలో వినియోగిస్తారు. చైనా ఆంక్షలతో కొన్ని యూరోపియన్ ఆటో విడిభాగాల తయారీ ప్లాంట్లు సైతం ఇప్పటికే ఉత్పత్తులను నిలిపివేశారు. ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెస్ బెంజ్ సైతం రేర్ ఎర్త్స్ కొరతను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నది.

## ఇన్ఫోసిస్‌కు రూ.32వేల కోట్లజీఎస్టీ ఉపశమనం..!

**తెలంగాణవీణ, బిజినెస్ బెంగళూరు**
ప్రముఖ ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్‌కు ఇదివరకు జారీ చేసిన రూ.32,403 కోట్ల జీఎస్టీ నోటీసుకు సంబంధించి డైరెక్టర్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ ఆ సంస్థకు ఉపశమనం కలిగించింది. 2018-19 నుంచి 2021-22 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన ప్రీ షోకాజ్ నోటీసు ప్రొసీడింగ్స్‌ను మూసివేస్తున్నట్టు డీజీజీఐ నుంచి తమకు సమాచారం అందినట్టు ఇన్ఫోసిస్ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. 2017 నుంచి 2022 మధ్య ఇన్ఫోసిస్ విదేశీ శాఖల్లో జరిగిన వ్యయాలకు సంబంధించి రూ.32,403 కోట్ల జీఎస్టీ నోటీసును 2024 జులైలో డీజీజీఐ జారీచేసింది. దీనిపై వివరణ ఇవ్వడంతో డీజీజీఐ తన నోటీసులను రద్దు చేసినట్టు తెలుస్తోంది.




## ఎంపీ ప్రియా సరోజ్‌తో క్రికెటర్ రింకు సింగ్ నిశ్చితార్థం..!



**తెలంగాణవీణ, క్రీడలు :**
భారత క్రికెటర్ రింకు సింగ్, సమాజ్ వాదీ పార్టీ ఎంపీ ప్రియా సరోజ్ నిశ్చితార్థం వేడుక ఘనంగా జరిగింది. లక్నోలో ఆదివారం జరిగిన కార్యక్రమానికి కుటుంబీకులు, అత్యంత సన్నిహితులు మాత్రమే జరగ్గా.. పలువురు రాజకీయ నేతలు, క్రీడాకారులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వీరిద్దరి పెళ్లి ఈ నెల 18న జరుగనున్నది. సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్-డింపుల్ యాదవ్ దంపతులు, ప్రముఖ నటి, ఎంపీ జయాబచ్చన్ హాజరై జంటను ఆశీర్వదించారు. బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా హాజరయ్యారు.ఈ సందర్భంగా శుక్లా మాట్లాడుతూ రింకు, ప్రియా ఇద్దరు తమతమ రంగాల్లో రాణిస్తున్నారని.. ఇద్దరు కలిసి విజయవంతమైన జంటగా నిలుస్తారన్నారు. వారిద్దరు ఆనందకరమైన జీవితం గడపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రియా సరోజ్ తండ్రి, ఎమ్మెల్యే తుఫానీ సరోజ్ మాట్లాడుతూ.. నిశ్చితార్థం కార్యక్రమానికి కుటుంబీకులు, బంధువులు, పలువురి స్నేహితుల సమక్షంలో జరిగిందన్నారు. రింకు - ప్రియా సింగ్ ఒకరినొకరు కొంతకాలం నుంచి పరిచయం ఉందని.. ప్రియా స్నేహితురాలి తండ్రి మాజీ క్రికెటర్ అని.. ఆయన ద్వారానే ఇద్దరికీ పరిచయం ఏర్పడిందన్నారు. ఇరు కుటుంబాల ఆశీస్సులతో ఇద్దరు వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారన్నారు. రింకు సింగ్ టీమిండియా తరఫున ఇప్పటి వరకు రెండు వన్డేలు, 33 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. ఇటీవల ముగిసిన ఐపీఎల్‌లో కేకేఆర్ జట్టులో సభ్యుడు. ఇక ప్రియా సరోజ్ ఉత్తరప్రదేశ్‌లోని వారణాసికి చెందిన కరి?యాన్ గ్రామవాసి. ఆమె తండ్రి తూఫానీ సరోజ్ మూడుసార్లు ఎంపీగా, ప్రస్తుతం ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఆయన వారసురాలిగా ప్రియా సరోజ్ మచిలీషహర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి తొలి ప్రయత్నంలోనే ఎంపీగా గెలిచింది. బీజేపీ సీనియర్ నేతపై 35వేల ఓట్ల మెజారిటీతో గెలిచి దేశంలోనే అతిపిన్న వయస్కురాలైన ఎంపీలో ఒకరిగా నిలిచారు.

## రోహిత్-కోహ్లీకి అరుదైన గౌరవం..

### ఆస్ట్రేలియాను మెచ్చుకోవాల్సిందే!

**తెలంగాణవీణ, క్రీడలు :**
ఆధునిక క్రికెట్‌పై చెరగని ముద్ర వేశారు టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, టాప్ బ్యాటర్ విరాట్ కోహ్లీ. ఆడిన ప్రతి దేశంలోనూ అదరగొట్టారీ స్టార్లు. టీ20, వన్డే, టెస్ట్ అనే తేడాల్లేకుండా బరిలోకి దిగితే చాలు.. పరుగుల వర్షం కురిపించడమే ధ్యేయంగా ఆడుతూ వచ్చారు. అయితే పొట్టి ప్రపంచ కప్-2024 తర్వాత టీ20లకు గుడ్‌బై చెప్పిన ఈ ద్వయం.. ఇటీవలే టెస్టులకూ రిటైర్‌మెంట్ ప్రకటించారు. ఇకపై వన్డేల్లో మాత్రమే కొనసాగుతామని వెల్లడించారు. దీంతో అభిమానులు తెగ బాధపడుతున్నారు. కనీసం ఫేర్‌వెల్ మ్యాచ్ ఆడకుండా రిటైర్ అవడం ఏంటని ఫీల్ అవుతున్నారు. సత్కరించే అవకాశం కూడా ఇవ్వరా అని వాపోతున్నారు. ఈ తరుణంలో రోహిత్-కోహ్లీ



కోసం క్రికెట్ ఆస్ట్రేలియా చేస్తున్న పని తెలిసి ప్రశంసల్లో ముంచెత్తుతున్నారు. అసలు సీఏ ఏం చేసిందంటే..

**ఘనమైన వీడ్కోలు..**
టెస్టులకు రిటైర్‌మెంట్ ఇచ్చేసిన రోహిత్-కోహ్లీని సత్కరించాలని క్రికెట్ ఆస్ట్రేలియా నిర్ణయించింది. ఈ ఏడాది ఆఖర్లో జరిగే వన్డే సిరీస్ సమయంలో రోకో జోడీని ప్రత్యేకంగా గౌరవించాలని డిసైడ్ అయింది. ఇద్దరు భారత స్టార్లకు ఘనమైన వీడ్కోలుకు ప్లాన్ చేస్తోంది. 'రోహిత్-కోహ్లీ ఆస్ట్రేలియా గడ్డ మీద ఆడటం బహుశా ఇదే చివరిసారి కావొచ్చు. అందుకే వాళ్లిద్దరికీ ఘనమైన వీడ్కోలు ఇవ్వాలని అనుకుంటున్నాం. అంతర్జాతీయ క్రికెట్‌కు వాళ్లు అందించిన సేవలకు గానూ గ్రాండ్ ఫేర్‌వెల్ ఇవ్వాలని ప్లాన్ చేస్తున్నాం' అని క్రికెట్ ఆస్ట్రేలియా సీఈవో టాడ్ గ్రీన్‌బెర్గ్ చెప్పుకొచ్చారు. కాగా, మూడు వన్డేల కోసం ఈ సంవత్సరం అక్టోబర్‌లో ఆస్ట్రేలియాకు పయనం కానుంది టీమిండియా. అక్టోబర్ 19న తొలి వన్డే, 23న రెండో వన్డే, 25వ తేదీన ఆఖరి మ్యాచ్ జరుగుతాయి. ఇది తెలిసిన నెటిజన్స్.. ఆసీస్ బోర్డుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నారు. దిగ్గజాలను గౌరవించడం గొప్ప విషయమని అంటున్నారు. ప్రత్యర్థి ఆటగాళ్లయినా గేమ్‌కు వాళ్లు అందించిన సేవలకు గుర్తుగా ఇలా వేడుకకు ప్లాన్ చేయడం భేష్ అని మెచ్చుకుంటున్నారు.

# స్పోర్ట్స్

## భారత అథ్లెట్లకు నాలుగు స్వర్ణాలు.. రజతంతో మెరిసిన యశాస్..!



**తెలంగాణవీణ, క్రీడలు :**
భారత అథ్లెట్లు తైవాన్ ఓపెన్ లో పతకాల పంట పండించారు. శనివారం జ్యోతి ఎర్రాజీ, అబ్దుల్లా, పూజలు స్వర్ణాలతో మెరవగా.. పోటీల చివరి రోజైన ఆదివారం కూడా మరో నాలుగు గోల్డ్ మెడల్స్ వచ్చాయి. మూడుసార్లు జాతీయ ఛాంపియన్ విథ్యా రామరాజ్ , రోహిత్ యాదవ్, పూజా, క్రిష్ణ కుమార్ లు తమ తమ విభాగాల్లో పసిడితో గర్జించారు. పురుషుల 400 మీటర్ల హర్డిల్స్ ఫైనల్లో యశాస్ పలాక్ష వెండి వెలుగులు విరజిమ్మాడు.తైవాన్ చివరిరోజున భారత అథ్లెట్లు పసిడి మోత మోగించారు. మహిళల 400 మీటర్ల హర్డిల్స్‌లో వైథ్యా చిరుతలా పరుగెత్తి స్వర్ణం కొల్లగొట్టింది. ఆదివారం జరిగిన ఫైనల్లో ఆమె 56.53 సెకన్లలోనే లక్ష్యానికి చేరుకుంది. తద్వారా త్వరలో జరుగబోయే వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో వైథ్య ర్యాంకింగ్స్ మెరుగవ్వనుంది. జావెలిన్ త్రోలో రోహిత్ అత్యుత్తమ ప్రదర్శన చేయకపోయినా 74.42 మీటర్ల దూరం ఈటెను విసిరి బంగారు పతకం సాధించాడు.ఇక మహిళల, పురుషుల 800 మీటర్ల పరుగులో భారత అథ్లెట్లు అదరగొట్టారు. అంచనాలను అందుకుంటూ పూజ భారత్‌కే చెందిన ట్వింకిల్ చౌదరీని రెండో స్థానానికి పరిమితం చేస్తూ 2.02 79 సెకన్లలో ఫినిషింగ్ లైన్ దాటింది. పురుషుల ఫైనల్లో క్రిష్ణ కుమార్ ప్రత్యర్థులకు షాకిస్తూ 148 46 సెకన్లలోనే లక్ష్యానికి చేరుకొని గోల్డ్ మెడల్ ఖాతాలో వేసుకున్నాడు.



తెలంగాణ వీణ
సినిమా
సోమవారం జూన్ 9 2025



# ఆ విషయంలో బాధగా ఉంది..

## అదొక చేదు వార్త అంటున్న పూజా హెగ్డే..

**తెలంగాణవీణ, సినిమా :**
అందాల బుట్టబొమ్మ పూజా హెగ్డే.. వరుసగా సినిమాలు చేస్తున్న అంతగా అదృష్టం మాత్రం కలిసి రావడం లేదు. అల్లు అర్జున్, జూనియర్ ఎన్టీఆర్, మహేష్ బాబు, ప్రభాస్, రామ్ చరణ్, పవన్ కళ్యాణ్ తదితర తెలుగు స్టార్ నటులందరితోనూ స్క్రీన్ షేర్ చేసుకుంది. కానీ కాలం గిర్రున తిరిగింది. గత మూడు సంవత్సరాలుగా పూజా హెగ్డే ఒక్క తెలుగు సినిమాలో కూడా నటించలేదు. వరుసగా హిట్ సినిమాలు, బ్లాక్ బస్టర్లు ఇచ్చిన ఆ నటి ఇప్పుడు చేతిలో ఒక్క తెలుగు సినిమా కూడా లేదు! ఇటీవలే సూర్య హీరోగా నటించిన రెట్రో సినిమాలో హీరోయిన్ గా చేసింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా కూడా ఆశించిన స్థాయిలో పేక్షకులను ఆకట్టుకోలేక పోయింది.పూజా హెగ్డే హీరోయిన్ గా చేసిన రాధేశ్యామ్, బీస్ట్, ఆచార్య, సిర్కస్, కిసీ కా భాయ్ కిసీ కి జాన్, దేవా రీసెంట్ గా వచ్చిన రెట్రో ఇలా వచ్చిన సినిమాలన్నీ ప్రేక్షకులను నిరాశపరిచాయి. వరుసగా ఏడు సినిమాలు ఫ్లాప్ అయినా కూడా ఈ అమ్మడికి వరుసగా ఛాన్స్ లు వస్తున్నాయి. ప్రస్తుతం దళపతి విజయ్ హీరోగా నటిస్తున్న జననాయగన్ సినిమాలో హీరోయిన్ గా నటిస్తుంది. ఈ సినిమా షూటింగ్ జెట్ స్పీడ్ తో జరుగుతుంది. ఈ సినిమాను పొలిటికల్ థ్రిల్లర్ గా తెరకెక్కిస్తున్నారు. తాజాగా పూజా హెగ్డే ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆసక్తికర కామెంట్స్ చేసింది. ఈ మధ్య కాలంలో నేను నటించిన సినిమాలు బాక్సాఫీస్ దగ్గర నిరాశపరుస్తున్నాయి. కొన్నాళ్లుగా నా లైఫ్ లో విజయం అనే పదానికి అర్థం మారిపోయింది. కానీ నాకు ఈ టైం చాలా ఇంపార్టెంట్.. భవిష్యత్తులో నేను చేసే సినిమాలు నేను ఎలాంటి నటిని అనేది ప్రేక్షకులకు చుపిస్తాయని అనుకుంటున్నా.. సినీ బ్యాగ్రౌండ్ నుంచి వచ్చిన నాలాంటి వాళ్లు ఇండస్ట్రీలో చాలా మంది ఉన్నారు.. వారు ఎన్నో సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇప్పుడు నేను ఈ స్థాయిలో ఉన్నా కానీ నేను సాధించాల్సింది చాలా ఉంది. అందరి జీవితంలో హెచ్చుతగ్గులు కచ్చితంగా ఉంటాయి. మేము నటులం ఫ్లాప్ లను కూడా స్వీకరించాలి. బీస్ట్ సినిమా తర్వాత ఇప్పుడు జన నాయగన్ సినిమాలో నటించడం ఆనందంగా ఉంది. కానీ ఇది విజయ్ చివరిచిత్రం అవ్వడం ఒకింత బాధగా అనిపిస్తుంది. నా దృష్టిలో ఇదొక చేదు వార్త. ఎందుకంటే నాతో పాటు చాలా మంది అభిమానులు విజయ్ సినిమాల్ని ఇష్టపడతారు. ఒకప్పుడు ఆయన సినిమాల కోసం ఎదురుచూసేవాళ్ళం అంటూ చెప్పుకొచ్చింది పూజా హెగ్డే. ఈ కామెంట్స్ ఇప్పుడు వైరల్ గా మారాయి.



# అఖండ 2' నుంచి బిగ్ అప్‌డేట్..

## టీజర్‌కి ముహూర్తం ఫిక్స్

**తెలంగాణవీణ, సినిమా :**
నటసింహం నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్లో తెరకెక్కుతున్న సంచలన చిత్రం 'అఖండ 2'. అఖండ సినిమాకి సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. 'అఖండ' సృష్టించిన ప్రభంజనం తర్వాత, దాని సీక్వెల్ 'అఖండ 2' (అఖండ 2 – తాండవం) పై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఇప్పటికే ప్రయాగ్‌రాజ్‌లోని మహాకుంభమేళాలో కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించిన చిత్ర యూనిట్, ఇటీవలే జార్జియాలో కూడా షూటింగ్ కూడా కంప్లీట్ చేసుకున్నట్లు సమాచారం. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా నుంచి టీజర్ అప్‌డేట్‌ను ప్రకటించారు మేకర్స్. ఈ సినిమా టీజర్‌ను జూన్ 09న సాయంత్రం 06.03 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. థమన్ సంగీతం అందిస్తున్నారు. సంయుక్త మీనన్ కథానాయికగా నటిస్తుండగా, యంగ్ హీరో ఆది పినిశెట్టి విలన్ పాత్రలో కనిపించనున్నారు. బాలయ్య మరోసారి అఘోరి పాత్రలో ప్రేక్షకులను మెప్పించడానికి సిద్ధమవుతున్నారు. ఈ సినిమా 2025 సెప్టెంబర్ 25న దసరా కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



# చిరు ఫ్యాన్స్‌కి డబుల్ ట్రీట్ ఇవ్వబోతున్న అనీల్ రావిపూడి..

## ఇది ఊహించలేదుగా..!

**తెలంగాణవీణ, సినిమా :**
మెగాస్టార్ చిరంజీవి కుర్ర హీరోలతో పోటీ పడుతూ సినిమాలు చేస్తున్నారు. ఆయన ఇటీవల విశ్వంభర చిత్ర షూటింగ్ పూర్తి చేసి ఇప్పుడు అనీల్ రావిపూడి దర్శకత్వంలో చేస్తున్నాడు. డైరెక్టర్ వశిష్టతో చేసిన విశ్వంభర చిత్రం సోషియో ఫాంటసీ సినిమాగా తెరకెక్కుతుంది . ఈ సినిమాలో త్రిష హీరోయిన్ గా నటిస్తుండగా, కీరవాణి విశ్వంభరకు సంగీతం అందిస్తున్నాడు. అయితే విశ్వంభర సినిమాపై ఇప్పటి వరకు ఎటువంటి అప్ డేట్ రాలేదు. కాని ఇటీవల మొదలైన అనిల్ రావిపూడి సినిమా మాత్రం పరుగులు పెడుతోంది. ఇక ఈసినిమా స్టార్ట్ అయిన అప్పటి నుంచి నిత్యం ఏదో ఒక వార్త టాలీవుడ్‌లో హల్‌చల్ చేస్తూనే ఉంది. ఈ మూవీ ఇప్పటికే తొలి షెడ్యూల్ పూర్తి చేసుకున్నట్టు తెలుస్తుండగా, మరి కొద్ది రోజులలో రెండో షెడ్యూల్ మొదలు పెట్టనున్నారట. చిరంజీవి కెరీర్లో 157వ సినిమాగా తెరకెక్కుతున్న ఈ ఫుల్ లెంగ్త్ కామెడీ ఎంటర్టైనర్లో చిరంజీవి డ్యూయల్ రోల్ లో కనిపించనున్నారనే వార్త ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అయింది. రెండు పాత్రలలో ఒక పాత్ర వింటేజ్ చిరంజీవిని గుర్తు చేసేలా ఉంటుందని, మరో పాత్ర ఫుల్ యాక్షన్ మోడ్‌లో ఉంటుందట. అయితే దీనిపై మూవీ టీమ్ నుంచి ఇప్పటి వరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన రాలేదు. కాని టాలీవుడ్ సర్కిల్ లో మాత్రం ఈ రూమర్ షికారు చేస్తోంది.ఇప్పుడు నయనతార , చిరంజీవిపై ఫ్యామిలీ సీన్స్ చిత్రీకరిస్తున్నాడట అనీల్ రావిపూడి.



# ఆ హీరో భార్యపై కేసేసిన కాంతార హీరోయిన్..

## కారణం ఏంటంటే

**తెలంగాణవీణ, సినిమా :**
కాంతార సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది అందాల భామ సప్తమీ గౌడ. కన్నడ భాషలో సినిమాలు చేసిన ఈ ముద్దుగుమ్మ కాంతారా సినిమాతో ఫేమస్ అయ్యింది. ఈ సినిమాలో డీ గ్లామర్ రోల్ లో నటించి మెప్పించింది. అలాగే ఈ సినిమాలో తన అందంతోనూ కవ్వించింది. కాంతార సినిమా తర్వాత దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి తెరకెక్కించిన బాలీవుడ్ చిత్రం ది వ్యాక్సిన్ వార్ లో కూడా నటించింది. ఈ సినిమా కూడా మంచి విజయం సాధించింది. దాంతో ఈ చిన్నదానికి ఆఫర్స్ పెరిగాయి. కన్నడ భాషలో వరుసగా సినిమాలు చేస్తూ బిజీ హీరోయిన్ గా మారిపోయింది. ఇదిలా ఉంటే గతంలో ఓ హీరో భార్య పై ఈ ముద్దుగుమ్మ కేసు వేసి హాట్ టాపిక్ గా మారింది. ఓ హీరో భార్య తన పై తప్పుడు ప్రచారం చేస్తుందని సప్తమి కోర్టులో కేసు వేశారు ఇంతకూ అసలు ఏం జరిగిందంటే.. కన్నడ ఇండస్ట్రీలోనూ విడాకులు హవా నడుస్తుంది. చాలా మంది స్టార్ కపుల్ ఆ మధ్యకాలంలో విడాకులు తీసుకున్నారు. అలాగే శివరాజు కుమార్ ఫ్యామిలీకి చెందిన యువరాజ్ కుమార్ కూడా తన భార్య నుంచి విడాకులు కోరాడు. తన భర్త అక్రమ సంబంధం పెట్టుకున్నాడు అని బాంబ్ పేల్చింది. అలాగే హీరోయిన్ సప్తమీ గౌడను ఈ కేసులోకి లాగింది ఆమె.. సప్తమి గౌడ, యువరాజ్ ప్రేమలో ఉన్నారని ఆరోపించింది. శ్రీదేవి భైరప్ప అమెరికా వెళ్లినప్పుడు యువ, సప్తమి కలిసి జీవించారని ఆమె ఆరోపించింది. సప్తమి గౌడ కోసం నన్ను ఇంటి నుంచి గెంటేసే ప్రయత్నం జరుగుతోందని శ్రీదేవి తన లాయర్ ద్వారా ఆరోపించింది. దీని పై సప్తమి సీరియస్ అయ్యింది. సప్తమి గౌడ శ్రీదేవి భైరప్పపై కోర్టులో కేసు వేశారు శ్రీదేవి భైరప్ప తన పరువుకు నష్టం కలిగించే ఆరోపణలు చేయకుండా నిషేధం విధించాలని కోర్టును కోరింది. శ్రీదేవి తనపై నెగిటివ్ స్టేట్ మెంట్ ఇచ్చిందని, తప్పుడు ఆరోపణలు చేసిందని స ఎ_ వి ం ఆరోపించింది. ఈ వార్త

Published and printed by ulloju Srinivas on behlf of Veena publications printed at telangana Veena plot no.204 Maitri apartments.opp BSNL office ECIL kapra,med responsible for selection of news under the prb act, phone number 040 35668720 rni reg no.teltel/2280 reproduction in whole or in part without written